

ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

దేవతలారా.. రండి

- శాస్త్రోక్తంగా ధ్వజారోహణ
- ప్రారంభమైన దేవుని కడప ఉత్సవాలు



ధ్వజారోహణ దృశ్యం

కడప (కల్చరల్), ఫిబ్రవరి 10: తిరుమల తొలిగడపగా ఖ్యాతిగాంచిన దేవునికడప లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం ధ్వజారోహణతో శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ప్రధాన అర్చకులు కృష్ణమోహన్, త్రివిక్రమ్ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ధ్వజస్తంభానికి ప్రత్యేక అలంకరణలు గావించి పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుల వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాలు, గోవింద నామ స్మరణల నడుమ గరుడ చిత్రపటాన్ని ధ్వజ స్తంభం పైకి ఆరోహణ చేశారు. సాయంత్రం 6గంటలకు స్వామివారికి ఊంజల్ సేవ నిర్వహించారు. పిదప తిరుమల తిరుపతి దేవస్థానము అన్నమయ్య ప్రాజెక్టు వారిచే వీనులవిందుగా అన్నమాచార్య కీర్తనలు ఆలపించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా రాత్రి 8 గంటలకు చంద్రప్రభ వాహనంపై శ్రీవారు ప్రత్యేక అలంకరణలో మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఈ గ్రామోత్సవంలో చెక్కభజన, కోలాటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈవో నటేష్‌బాబు, సూపరింటెండెంట్ హనుమంతయ్య, ఇన్‌స్పెక్టరు ఈశ్వర్‌రెడ్డితో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.




కోలాటం చేస్తున్న దృశ్యం

డబ్బులతో.. బుజ్జగింపులు..?

- అసంతృప్త నేతలకు వైసీపీ తాయిలాలు
- పులివెందుల, జమ్మలమడుగులో పంపిణీ
- నేత స్థాయిని బట్టి రూ.3 లక్షల నుంచి రూ.30లక్షల వరకు అందజేత
- కొందరికి కాంట్రాక్టు పనులు కేటాయింపు

వచ్చే ఎన్నికలు వైసీపీ, టీడీపీకి చావో రేవో అనేలా మారనున్నాయి. సొంత జిల్లాలో పట్టు సడలితే రాజకీయంగా జగన్‌కు పెద్ద దెబ్బ తగిలినట్లుంటుంది. అందుకే అసంతృప్తితో ఉన్న కేడర్‌ను బుజ్జగించేందుకు తాయిలాలకు తెరలేపారనే ప్రచారం ఉంది. ద్వితీయ శ్రేణి నేతల స్థాయిని బట్టి రూ.3 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు ఇస్తే.. మరి కొందరికి కాంట్రాక్టు పనులు ఇచ్చి మంచి చేసుకుంటున్నట్లు చెబుతున్నారు. ఈ తాయిలాల పంపిణీ వ్యవహారం ఇప్పటికే సీఎం సొంత నియోజక వర్గం పులివెందులలో పూర్తి చేసినట్లు చెబుతారు. ఇప్పుడు జమ్మలమడుగులో పులివెందుల ఫార్ములాను వైసీపీ కేడరుకు అమలు చేస్తున్నట్లు జిల్లా రాజకీయ వర్గాలు అంటున్నాయి.



(కడప-ఆంధ్రజ్యోతి): జిల్లా వైసీపీలో అసంతృప్తి నేతలను బుజ్జగించే ప్రయత్నాలు ముమ్మరంగా చేస్తున్నారు. జగన్ పాలనలో మండలానికి ముగ్గురు, నలుగురు వైసీపీ నాయకులు మాత్రమే లబ్ధి పొందుతూ వచ్చారు. వైసీపీ పార్టీ జెండా మోసి జగన్‌ను సీఎం చేసేందుకు క్షేత్రస్థాయిలో సొంత లెక్క ఖర్చు పెట్టుకుని పనిచేసిన వారికి అంత ప్రాధాన్యత ఇవ్వలేదంటారు. జగన్ ఐదేళ్ల పాలనలో కొందరి చేతుల్లోనే పెత్తనం, కాంట్రాక్టు పనులు నచ్చిన వారికే కట్టబెట్టడం, కనీసం సీఎంను కలిసే అవకాశం కూడా లేకపోవడంతో కేడర్ అంతా రగిలిపోతోంది. వలంటీర్లకు ఉన్న గౌరవం కూడా లేదని ద్వితీయ స్థాయి నాయకులు అసహనంతో ఉన్నారు. దీనిని గమనించిన వైసీపీ నష్ట నివారణ చర్యలు చేపట్టినట్లు రాజకీయ వర్గాలు అంటున్నాయి. డబ్బులతో వీరిని బుజ్జగించే ప్రయత్నాలు మొదలు పెట్టిందని సమాచారం.

పులివెందుల వైఎస్ కుటుంబానికి అడ్డా

జగన్ కుటుంబానికి పులివెందుల వెన్నంటే నడిచింది. దివంగత వైఎస్సార్ రాజకీయ అరంగేట్రం నుంచి ఆయన వెంటే నడుస్తోంది. కష్టకాలాల్లో కూడా పులివెందుల వైఎస్ కుటుంబాన్ని ఆదుకుంది. వైఎస్ మరణానంతరం జగన్ వైసీపీ స్థాపించినప్పటి నుంచి ఆయనకు అండగా ఉంటూ వస్తోంది. అయితే దివంగత వైఎస్‌కు సీఎం జగన్‌కు చాలా తేడా ఉందంటారు. ఆయన కేడర్‌కు ప్రాధాన్యత ఇచ్చేవారు. తనను నమ్ముకున్న కార్యకర్తలు కష్టసుఖాలలో పాలుపంచుకోవడంతో పాటు వారికి ఆర్థిక భరోసా కల్పించేవారని చెబుతారు. అయితే జగన్ పాలనలో కేవలం మండలానికి ముగ్గురు నలుగురు నాయకులు తప్ప ద్వితీయ శ్రేణి కేడరుకు న్యాయం జరగలేదని అంటారు. పులివెందుల అంతా ఎంపీ అవినాశ్‌రెడ్డి కనుసన్నల్లోనే ఉంది. పట్టణంలో వీళ్లదే పెత్తనం అంటారు. పాడా ద్వారా పులివెందుల అభివృద్ధికి వందల కోట్లు కేటాయిస్తున్నారు. ఆయా మండలాల్లో ముగ్గురు నలుగురు నేతలకే పనులు ఇస్తున్నారంటూ వైసీపీ కేడరు తీవ్ర అసంతృప్తిలో ఉన్నట్లు చెబుతారు.

జగన్‌పై సొంతూరిలోనే అసంతృప్తి

జగన్ పాలనపై సొంతూరులోనే జనంతో పాటు క్యాడరు సంతృప్తిగా లేరని రాజకీయపరిశీలకులు అంటున్నారు. ఈ నేపథ్యంలో సీఎం జగన్ ఇటీవల పులివెందుల వచ్చినప్పుడల్లా మండలస్థాయి నేతలతో సమావేశం అవుతూ వచ్చారు. పార్టీ కోసం కష్టపడ్డా గుర్తింపు లేదంటూ కార్యకర్తలు ఆయన ఎదుట ఆవేదనను వెలిబుచ్చినట్లు చెబుతారు. దీంతో కేడరును బుజ్జగించే యత్నానికి తెరలేపారంటారు. క్షేత్రస్థాయిలో అసంతృప్తిగా ఉన్న నాయకుల స్థాయిని బట్టి రూ.3లక్షల నుంచి రూ.30లక్షల వరకు ఆర్థిక సాయం చేశారని ప్రచారం జరుగుతోంది. వేంపల్లెలో ఓ ప్రజాప్రతినిధికి అనుచరుడుగా ఉన్న ఒకతని కుటుంబానికి రూ.18లక్షలు ఇచ్చారంటారు. ఇప్పటికే వేంపల్లె, లింగాల, వేముల, తొండూరు, చక్రాయపేట, సింహాద్రిపురం, పులివెందుల మండలాల్లో పంపిణీ పూర్తయినట్లు సమాచారం. డబ్బులు వద్దన్న వారికి కాంట్రాక్టు పనులు అప్పగించినట్లు చెబుతున్నారు. ఇటీవల పాడా, ఎంపీ నిధులతో సుమారు రూ.20 కోట్ల విలువ చేసే మట్టి పనులను అసంతృప్త నేతలకు ఇచ్చి బుజ్జగింపు కార్యక్రమాలు చేపట్టినట్లు చెబుతున్నారు. ఇటీవల వేముల, వేంపల్లె, పులివెందుల, సింహాద్రిపురం, లింగాల నుంచి కొందరు వైసీపీ నేతలు టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి సమక్షంలో సైకిలు ఎక్కుతున్నారు. ఇది కూడా వైసీపీ నేతలకు ఆందోళన కలిగించి సొంత పార్టీ కేడరును సైకిలు ఎక్కకుండా ఆపేందుకు తాయిలాలకు తెరలేపారని అంటారు.

జమ్మలమడుగులోనూ..

ఓటర్లకే కాదు... సొంత పార్టీ నేతలకు కూడా డబ్బులు ఇచ్చి పార్టీ మారకుండా చేసుకునే పులివెందుల ఫార్ములాను జమ్మలమడుగులో కూడా అమలు పరుస్తున్నారని అంటున్నారు. రెండురోజుల క్రితం మాజీ ఎమ్మెల్సీ నారాయణరెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. డబ్బు సంచులతో వైసీపీ నాయకులు తిరుగుతున్నారంటూ ఆరోపించారు. టీడీపీ ఇన్‌చార్జిగా భూపేశ్‌రెడ్డిని నియమించినప్పటి నుంచి ఆయన తన దైన శైలిలో ప్రజలతో మమేకమవుతూ పల్లెపల్లె తిరుగుతున్నారు. వైసీపీ నేతలను టీడీపీలోకి చేర్చుకుంటున్నారు. జమ్మలమడుగు నియోజకవర్గంలో సైతం కాంట్రాక్టు పనులు, పదవులు పవర్‌లో తమకు ప్రాధాన్యత లేదని కేడర్ అసంతృప్తిగా ఉందంటారు. వీరిలో కొందరు టీడీపీ గూటికి చేరుతుండడంతో వెంటనే ఇక్కడ కూడా నష్టనివారణకు తెరలేపారని అంటున్నారు. కొండాపురం, పెద్దముడియం మండలాల్లో కొందరు నేతలకు భారీగా తాయిలాలు ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. నేతను బట్టి ఐదు నుంచి 30 లక్షల వరకు ముట్టజెప్పినట్లు తెలిసింది. మిగతా మండలాల్లో కూడా అసంతృప్తులకు బుజ్జగించేందుకు తాయిలాలు ఇచ్చిసంతృప్తి పరిచేందుకు సిద్ధమవుతున్నారన్న ప్రచారం ఉంది. మొత్తానికైతే ఇప్పటి దాకా ప్రాధాన్యత లేని తాము ఎన్నికల సమయంలో గుర్తుకు వచ్చామా అంటూ కొందరు క్షేత్రస్థాయి లీడర్లు గుసగుసలాడుకోవడం గమనార్హం.

తాళ్లమాపురంలో ఎమ్మెల్యేకు సమస్యల స్వాగతం

- ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన యువత

ప్రొద్దుటూరు , ఫిబ్రవరి 10: వైసీపీ ప్రభుత్వం ఈ ఐదేళ్లలో గ్రామాల్లో కనీసం తాగునీటి వసతి, రోడ్లు లాంటి మౌలిక వసతులపై దృష్టి పెట్టలేదు. పంచాయతీలకు వచ్చిన నిధులు సైతం రాష్ట్ర ప్రభుత్వం వేరే పథకాలకు మళ్లించేసింది. దీంతో గ్రామాల్లో రోడ్ల మరమ్మతులు సైతం చేపట్టడంలేదు. ఈ నేపథ్యంలో శనివారం తాళ్లమాపురానికి వెళ్లిన ఎమ్మెల్యే రాచమల్లుకు అక్కడి యువత వినూత్నంగా స్వాగతం పలికారు. తాళ్లమాపురం గ్రామ సమస్యలపై స్పందిచాలంటూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

శనివారం తాళ్లమాపురంలో విలేజ్‌క్లినిక్ ప్రారంభానికి ఎంపీ అవినాశ్‌రెడ్డి, ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి వస్తున్నారని తెలిసి ఆ గ్రామ యువత, అక్కడి ననాయకులు తమ గ్రామంలో రోడ్ల దుస్థితి తెలుపుతూ పెద్ద పెద్ద ఫ్లెక్సీలు వేశారు. గ్రామానికి వచ్చే రోడ్డు అంతా అడుగుకో గుంత గజానికో గొయ్యిలా ఉందని అందులో పేర్కొంటూ రోడ్ల ఫొటోలతో ఫ్లెక్సీలు వేశారు. గ్రామంలో తాగునీరు లేదని ఉప్పునీళ్లు తాగుతున్నామని అందులో తెలిపారు. ఈ సమస్యలు నాయకులు గుర్తించి పరిష్కరించాలని కోరారు. ఈ ఫ్లెక్సీలు వైసీపీ నేతల్లో కలవరం పుట్టించాయి.



తాళ్లమాపురం గ్రామ సమస్యలపై ఎమ్మెల్యే స్పందించాలంటూ యువత ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ


సాధారణ ఎన్నికలకు సమాయత్తం

- కలెక్టర్ విజయరామరాజు

కడప(కలెక్టరేట్), ఫిబ్రవరి 10: సాధారణ ఎన్నికలను ప్రశాంతంగా పారదర్శకంగా నిర్వహించేందుకు యంత్రాంగం సమాయత్తం కావాలని కలెక్టర్ విజయ రామరాజు ఆదేశించారు. శనివారం రాజధాని అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్సు ద్వారా త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికలకు సన్నద్ధత, నిర్వహణకు సంబంధించిన వివిధ అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (చీఫ్ ఎలక్టోరల్ అధికారి) ముఖేశ్ కుమార్ మీనా అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో సమీక్షించారు. కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి కలెక్టర్‌తో పాటు జేసీ గణేశ్‌కుమార్, నగరపాలక కమిషనర్ ప్రవీణ్‌చంద్, డీఆర్వో గంగాధర్ గౌడ్, స్పెషల్ కలెక్టర్ కౌసర్‌భాను, డిప్యూటీ కలెక్టర్ ప్రత్యూష హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ ఎపిక్ కార్డ్స్ జనరేషన్, పోలింగ్ స్టేషన్లలో మౌలిక వసతులు, శిక్షణ కార్యక్రమాలు, భద్రతా ఏర్పాట్లు, కమ్యూనికేషన్ ప్లాన్స్, పోలింగ్ రూట్స్, పోలీసు ఫోర్సు తదితర అంశాలపై జిల్లాల వారీగా అడిగి తెలుసుకున్నారు. సాధారణ ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన కార్యచరణపై దిశానిర్దేశం చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ కడప పార్లమెంట్ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా గత సంవత్సరం జనవరి నుంచి ఇప్పటివరకు 2,66,019 ఎపిక్ కార్డులను జనరేట్ చేశామన్నారు. మొత్తం 1941 పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపు, వీల్‌చైర్స్, విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, వెబ్ క్యాస్టింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే అధికారులకు ట్రైనింగ్ ప్రోగ్రామ్స్ ఈనెలలో పూర్తి చేస్తామన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి, అక్కడ పోలీసు బలగాలను, వీడియోగ్రఫీ, మైక్రో అబ్జర్వర్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే ఫారమ్-6, 7, 8ల పరిష్కారాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సీఈవోకు కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు మధుసూదన్, శ్రీనివాసులు, వెంకటరమణ, వెంకటేశం, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

నిల్వలు కొండంత.. పట్టుకునేది గోరంత

- పులివెందులలో భారీగా అక్రమ మద్యం నిల్వలు
- అంతా పెద్దల కనుసన్నల్లోనే దిగుమతి
- ఎన్నికల సీజన్‌తో భారీగా అక్రమ మద్యం దిగుమతి



పులివెందుల పోలీస్‌స్టేషన్

పులివెందుల టౌన్, ఫిబ్రవరి 10: పులివెందులలో అక్రమ మద్యం నిల్వలు కొండంత ఉంటే పట్టుకునేది గోరంత అన్నట్లుగా ఇక్కడి పోలీసులు, ఎస్ఈబీ శాఖల పనితీరు ఉంది. విచ్చలవిడిగా అక్రమ మద్యం తెప్పించుకుంటున్న పెద్ద తలకాయలను వదిలేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో బ్రాండెడ్ మద్యం మందుబాబులకు కరువైపోయింది. ఈ కారణంగా కొందరు ఇతర రాష్ట్రాల నుంచి తెప్పించి అక్రమ మద్యాన్ని డోర్ డెలివరీ చేసేవారు. వ్యాపారం పెరగడంతో రాజకీయ పెద్దల అండతో తమ అక్రమ వ్యాపారాన్ని విస్తృతం చేశారు. అధికార బలం, పోలీసుల అండతో ఇతర రాష్ట్రాల నుంచి మద్యం దిగుమతి చేసుకుంటూ వస్తున్నారు. అయితే ఎన్నికలు సమీపిస్తుండడంతో ఏకంగా పెద్దలే రంగంలోకి దిగినట్లు సమాచారం. గోవా, కర్ణాటక, తెలంగాణ, హర్యానా రాష్ట్రాల నుంచి భారీగా అక్రమ మద్యం పులివెందులకు చేరుకుంటోంది. అంతా పెద్దల కనుసన్నల్లో సాగుతుండడంతో పులివెందులలో భారీగా అక్రమ మద్యం నిల్వలు ఉన్నట్లు సమాచారం. ఓ ప్రాంతంలో ట్యాంకర్‌లో దాచిపెట్టి మరీ అక్రమ విక్రయాలు చేపట్టినట్లు తెలిసింది.

అక్రమ మద్యం అమ్మకాల్లో యువత

ఇటీవల పులివెందులలో అక్రమ మద్యం పలుమార్లు పట్టుబడింది. అయినా మద్యం అక్రమంగా దిగుమతి అవుతోందంటే పెద్దల అండలేనిదే సాధ్యం కాదనేది నగ్నసత్యం. ఈ అక్రమ మద్యం వ్యాపారంలో యువత కూడా పాలుపంచుకున్నట్లు సమాచారం. ఇటీవల అక్రమ మద్యం విక్రయిస్తూ, రవాణా చేస్తూ పట్టుబడిన వారిలో యువకులే ఉంటున్నారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు వస్తుండడంతో ఈ అక్రమ వ్యాపారంలోకి దిగుతున్నట్లు తెలిసింది. నెలనెల పోలీసులకు, ఎస్ఈబీ అధికారులకు ముడుపులు చేరవేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇదిలా ఉండగా పోలీసులకు పట్టుబడిన అక్రమ మద్యంలో కొంత దాచిపెడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం.

పెద్దల కనుసన్నల్లోనే

అక్రమ మద్యం వ్యాపారం అంతా పెద్దల కనుసన్నల్లోనే సాగుతున్నట్లు తెలుస్తోంది. బెల్టు షాపులు నిర్వహించే వారు నిరాఘాటంగా తమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారంటే వారికి రాజకీయ అండ లేనిదే ఇంత సాహసం చేయరనేది బహిరంగ రహస్యం. ఎస్ఈబీ మరియు పోలీసు శాఖలు దాడులు చేసి అక్రమ మద్యం పట్టుకున్నప్పటికి రాజకీయ పెద్దలు ఫోన్లు చేసి వదిలేయాలని చెబుతున్నట్లు తెలిసింది. దీంతో మరింత రెచ్చిపోయి అక్రమ మద్యాన్ని ఏరులై పారిస్తున్నారు. డోర్ డెలివరీ చేస్తున్నారు. త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అక్రమ మద్యం దిగుమతులు ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. పోలీసులు దృష్టిసారించి అక్రమ మద్యం వ్యాపారంపై ఉక్కుపాదం మోపితే మరిన్ని మద్యం నిల్వలు పట్టుబడే అవకాశం ఉంది.

దాడులు విస్తృతం చేస్తాం..

మద్యం అక్రమ రవాణాపై దాడులు మరింత విస్తృతం చేస్తామని, పులివెందులలో అక్రమ మద్యం అమ్మేవారిపై ఉక్కుపాదం మోపుతామని సీఐ శంకర్‌రెడ్డి తెలిపారు. అలాగే పోలీసు సిబ్బందిపై వస్తున్న ఆరోపణలను పరిగణలోకి తీసుకుంటామని, చెక్‌పోస్టుల వద్ద నిఘా పెంచుతామని ఆయన తెలిపారు.

అరటి కాయల మాటున.. హర్యానా మద్యం తరలింపు

- 965 మద్యం బాటిళ్లు సీజ్
- ఐచర్ వాహనం, బొలెరో స్వాధీనం
- ఆరుగురు అరెస్టు

కడప (క్రైం), ఫిబ్రవరి 10: అరటికాయల మాటున పులివెందులకు తరలిస్తున్న రూ.5.50 లక్షల విలువైన హర్యానా మద్యాన్ని పోలీసులు సీజ్ చేశారు. ఐచర్, బొలెరో వాహనాల్లో ఉన్న మద్యం స్వాధీనం చేసుకుని ఆరుగురు నిందితులను అరెస్టు చేశారు. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం కడపలోని పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏఎస్పీ (అడ్మిన్) లోసారి సుధాకర్ వివరాలు వెల్లడించారు.

పులివెందుల సబ్ డివిజను పరిధిలో శనివారం ఉదయం 10గంటలకు కదిరి-పులివెందుల రోడ్డులోని కనంపల్లె చెక్‌పోస్టు వద్ద వాహనాలను పులివెందుల డీఎస్పీ ఆధ్వర్యంలో అర్బన్ సీఐ సి.శంకర్‌రెడ్డి, ఎస్ఐ అరుణ్‌రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ శ్రీనివాసులరెడ్డి తమ సిబ్బందితో కలిసి తనిఖీలు చేశారన్నారు. పథకం ప్రకారం కదిరి నుంచి ఐచర్, బొలెరో వాహనాల్లో అరటికాయల బాక్స్‌లలో హర్యానా రాష్ట్రానికి చెందిన 390 ఫుల్ బాటిళ్లు, 575 క్వార్టర్ బాటిళ్లు పులివెందుల వైపు తరలిస్తుండగా స్వాధీనం చేసుకోవడంతో పాటు ఆరుగురిని అరెస్టు చేశామన్నారు.

అరెస్టయిన ఆరుగురు నిందితుల్లో పులివెందుల టౌన్ బ్రాహ్మణపల్లె రోడ్డులో నివాసం ఉండే రాగిపాటి మహబూబ్‌బాషా, మారుతిహాల్ వీధికి చెందిన చావిడి నాగరాజు, ఎస్‌బీఐ కాలనీ-2వ లైన్‌లో ఉన్న షేక్ సుభాన్, పెండ్లిమర్రి మండలం బాలయ్యగారిపల్లెకు చెందిన మాచిరెడ్డి మదనమోహన్‌రెడ్డి, ఎర్రగుడిపాలెంలో నివాసం ఉంటున్న కంభటి హరిక్రిష్ణ, వేముల మండలం వేల్పుల గ్రామానికి చెందిన ఓబుల్‌రెడ్డి ఉన్నారన్నారు. ఇందులో సూత్రధారి లింగాల మండలం అంబకపల్లెకు చెందిన బండి శ్రీనాథ్‌రెడ్డి అని తెలిసిందన్నారు. ప్రస్తుతం అతను ఓ కేసులో జైలులో ఉన్నాడన్నారు. స్వాధీనం చేసుకున్న మద్యం విలువ సుమారు రూ.5.50 లక్షలు ఉంటుందని, ఐచర్ వాహనం రూ.10లక్షలు, బొలెరో వాహనం రూ.5 ల క్షలు ఉంటుందన్నారు. ఇవన్నీ కలిపి రూ.20.50 లక్షలు చేస్తాయన్నారు. సీజ్ చేయడంలో కృషి చేసి పులివెందుల అర్బన్ సీఐ శంకర్‌రెడ్డి, ఎస్ఐ అరుణ్‌రెడ్డి, ఎస్‌బీ ఎస్ఐ శ్రీనివాసులరెడ్డి, సిబ్బందిని ఏఎస్పీ అభినందించారు.



పులివెందుల నియోజకవర్గంలో పట్టుబడిన హర్యానా మద్యం బాటిళ్లు



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ లోసారి సుధాకర్

కడప ఉక్కు.. మన హక్కు

- దానిని వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు
- జగన్ ప్రభుత్వంలో ఏ ఒక్కరికి ఎలాంటి పని జరుగలేదు
- జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి

జమ్మలమడుగు, ఫిబ్రవరి 10: కడప ఉక్కు మన హక్కు అని అయినా వైసీపీ ప్రభుత్వం దీనిని పట్టించుకోలేదని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి దేవగుడి భూపేశ్‌రెడ్డి అన్నారు. స్టీల్‌ప్లాంట్ సాధన కోసం 'కడప ఉక్కు మా హక్కు' పేరిట ఆయన శనివారం ఉదయం 7.30 గంటలకు జమ్మలమడుగు నుంచి చేపట్టిన పాదయాత్ర రాత్రి సుమారు 8.30గంటలకు పెద్దండ్లూరు గ్రామానికి చేరుకుంది. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. రాజశేఖర్‌రెడ్డి హయాంలో బ్రహ్మణి స్టీల్ ప్లాంట్ పూర్తయి దేవగుడి పరిసర ప్రాంతాల గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఆరోజు ప్రజలు అనుకున్నారన్నారు. ఆయన చనిపోయిన తర్వాత ఆయన కుమారుడు జగన్మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక ఆయన రెండుసార్లు శంకుస్థాపన చేశారే కానీ స్టీల్ ప్లాంట్ నిర్మాణం మాత్రం చేయలేదన్నారు. వైసీపీ ప్రభుత్వ వ్యవహారం చూసిన ప్రతి ఒక్కరు భయపడి ఫ్యాక్టరీ నిర్మాణానికి ముందుకు రావడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వాన్ని గట్టిగా అడిగి ఫ్యాక్టరీ నిర్మించాలని చెప్పే ధైర్యం ఈ ముఖ్యమంత్రికి లేదన్నారు. జమ్మలమడుగులో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి చేతకాని దద్దమ్మ అన్నారు. అనేకసార్లు సున్నపురాళ్లపల్లెలో ఎంపీతోపాటు సమావేశాలు ఏర్పాటు చేసినా ఇప్పటికీ ఒక ఎకరా భూమి వారికి, మరికొందరికి పరిహారం ఇవ్వలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రాగానే స్టీల్‌ప్లాంట్‌కు సంబంధించి చంద్రబాబునాయుడుతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని అన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల సమస్యలను పరిష్కరించడంతో పాటు ప్రధానంగా స్టీల్‌ప్లాంట్ వచ్చేలా కృషి చేస్తామన్నారు. పెద్దదండ్లూరు సర్పంచ్ రామాంజనేయ రెడ్డి, జనసేన నాయకులు నల్లంశెట్టి నాగార్జున, జగదీష్ మాట్లాడారు.



పెద్దదండ్లూరు గ్రామంలో బహిరంగ సభలో మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి



స్టీల్ ఫ్యాక్టరీ స్థలం వద్దకు పాదయాత్రగా వెళుతున్న జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి

అధిక వడ్డీంపులు

- రుణాలు ఇచ్చేటపుడు చెప్పింది 9.9 శాతం
- వడ్డీ వసూలు చేసేటపుడు 12.9 శాతం
- ఇది డీసీసీ బ్యాంకు తీరు
- ఇదెక్కడి న్యాయమని గగ్గోలు పెడుతున్న రైతులు



12.9 శాతం వడ్డీతో బ్యాంకు అధికారులు రైతుకు అందించిన డిమాండ్ నోటీసు

పులివెందుల, ఫిబ్రవరి 10: అసలే కరువు కాటకాలు.. సాగుచేసిన పంటలన్నీ వర్షాభావ పరిస్థితులతో నిలువునా ఎండిపోయి... సాగుకు పెట్టిన పెట్టుబడులు కూడా దక్కని దయనీయ స్థితిలో జిల్లారైతాంగం ఉంది. కానీ డీసీసీ బ్యాంకు మాత్రం అధిక వడ్డీలతో రైతుల నడ్డి విరుస్తోంది. బ్యాంకు రైతులకు రుణాలు ఇచ్చే సమయంలో 9.9శాతం వడ్డీ అని చెప్పి ఇచ్చింది. వసూలు చేసేటపుడు మాత్రం 12.9శాతం వడ్డీతో వసూలు చేస్తోంది. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. వివరాలు ఇలా.. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) మూడు నాలుగు సంవత్సరాలుగా ఎస్‌టీ (షార్ట్ టర్మ్), అదర్స్ పేరుతో పెద్దఎత్తున రైతులకు రుణాలు మంజూరు చేసింది. ఈ రుణాలు ఇచ్చేందుకు బ్యాంకు సిద్ధమైన సమయంలో మొదట్లో రైతులు రుణాలు తీసుకునేందుకు సుముఖత చూపలేదు. దీంతో ఫ్లెక్సీలు కట్టి, కరపత్రాలు పంచి 9.9శాతంతో రుణాలు ఇస్తామని బాహాటంగా పెద్దఎత్తున ప్రచారం చేసింది. అనంతరం పలువురు రైతులు రుణాలు తీసుకున్నారు.

గత ఏడాది 11.9 శాతం అన్నారు

గత ఏడాది రుణాల వసూలు సమయంలో వడ్డీ 9.9శాతం బదులు 11.9శాతం వసూలుకు రంగం సిద్ధం చేసింది. ఆ సమయంలో రైతుల నుంచి తీవ్ర నిరసనలు ఎదురయ్యాయి. దీనిపై ఆంధ్రజ్యోతిలో కథనాలు ప్రచురితం అయ్యాయి. దీంతో దీంతో బ్యాంకు ఒకడుగు వెనక్కి తగ్గి 9.9శాతం వడ్డీతోని మాత్రమే రైతులనుంచి వసూలు చేసింది.

ఈ ఏడాది 12.9 శాతం చేశారు

ఈ ఏడాది 12.9శాతంతో వడ్డీ వసూలు చేయాలని జిల్లా కేంద్రం నుంచి ఆయా బ్యాంకులకు ఆదేశాలు అందాయి. ఆ మేరకు రైతుల నుంచి ఆయా బ్యాంకులు డిమాండ్ నోటీసులు అందించారు. ఇప్పటికే పలు బ్రాంచుల్లో రైతుల నుంచి 12.9శాతం వడ్డీ వసూలు చేశారు. గడువు తీరితే మరింత వడ్డీ పెరుగుతుందని రైతులు భయపడుతున్నారు. దీనికారణంగా గడువులోపే అధిక వడ్డీ చెల్లించేందుకు సిద్ధపడుతున్నారు. కొందరు రైతులు మాత్రం దీనిపై ఉద్యమించేందుకు సిద్ధమవుతున్నారు.

కరువున్నా కనికరం లేదు

డీసీసీ బ్యాంకు ఎస్‌టీ, అదర్స్ పేరుతో రైతులకు ఎన్ని ఎకరాలు ఉంటే అన్ని ఎరకాలకు మార్కెట్ కంటే రెండింతలు ఎక్కువగా రుణాలు మంజూరు చేసింది. ఒక్కో రైతు కనీసం రూ.5లక్షల నుంచి రూ.40లక్షల వరకు రుణాలు తీసుకున్నారు. జిల్లాలో వందలకోట్ల రూపాయలు రైతులు రుణాలు తీసుకున్నారు. ఈ ఏడాది కరువు కారణంగా వడ్డీ చెల్లించడమే కష్టమని, ఇక రుణాలు ఎటూ చెల్లించలేరనే ఉద్దేశంతో కావాలనే 12.9శాతం వడ్డీ వసూలు చేస్తున్నారని రైతులు అంటున్నారు. చెప్పిన మేరకు కాకుండా 3శాతం అధికంగా వడ్డీ వసూలు చేస్తున్నారు. జిల్లాలో రైతులు తీసుకున్న రుణాలు 500 కోట్లు అనుకుంటే.. దీనికి వీరి నుంచి అదనంగా వసూలు చేస్తున్న మొత్తం రూ.15కోట్లు. కరువు కాలంలో రైతులకు ఇది భారమే. 12.9శాతం వడ్డీ వసూలు చేస్తామని ముందే చెప్పిఉంటే ఈ రుణాలను తాము తీసుకునే వాళ్లమే కాదని రైతులు అంటున్నారు. ఈ ఏడాది అటు ఖరీఫ్, రబీ సీజన్‌లలో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం సైతం కరువు జిల్లాగా ప్రకటించకపోవడంతో పరిహారం అందేది అనుమానమే. ఒకవైపు కంటికెదురుగా కరువు కనిపిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం.. మరోవైపు ఇదే కరువును అదనుగా తీసుకుని డీసీసీ బ్యాంకు వారు అధిక వడ్డీ భారం మోపడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

కారు బోల్తా : వైద్య విద్యార్థి మృతి



లిఖిత్‌కుమార్‌రెడ్డి మృతదేహం - బోల్తాపడిన కారు

ఒంటిమిట్ట/తవణంపల్లె, ఫిబ్రవరి 10: కారు బోల్తా పడటంతో ఓ వైద్య విద్యార్థి మృతి చెందాడు. ఏఎస్‌ఐ రాజేంద్ర తెలిపిన వివరాల మేరకు.. కడప జిల్లా ఒంటిమిట్టకు చెందిన ఆకేపాటి శివారెడ్డి, లతల చిన్న కుమారుడు లిఖిత్‌కుమార్‌రెడ్డి (22) చిత్తూరులోని ప్రైవేట్ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ చదువుతున్నాడు. అదే కాలేజీలో చదువుకునే స్నేహితులు పులి భరత్‌గణేష్‌రెడ్డి, వెంకటేష్ నాయక్, త్రిలోక్, మల్లా శశికుమార్‌లతో కలిసి శుక్రవారం రాత్రి ఐరాల మండలంలోని రిసార్టుకు కారులో వెళ్లాడు. శనివారం వేకువజామున తిరిగి చిత్తూరు వస్తుండగా తవణంపల్లె మండలంలోని సత్తారు బావి వద్ద కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న కల్వర్టును ఢీకొని బోల్తా పడింది. లిఖిత్‌కుమార్‌రెడ్డి తలకు బలమైన గాయాలవగా, మిగిలిన వారికి స్వల్పగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం లిఖిత్‌కుమార్‌రెడ్డిని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కారులో ప్రయాణిస్తున్న త్రిలోక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

పశువుల మేత మీద పడి మహిళ మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ

కొండాపురం , ఫిబ్రవరి 10 : మండలంలోని దత్తాపురం గ్రామంలో శనివారం ప్రమాదవశాత్తు పశువుల మేత ఉల్లిపడి కొండల శ్రావణి కుమారి (34) అనే మహిళ మృతి చెందింది. పోలీసుల వివరాల మేరకు... శ్రావణికుమారి పశువుల మేత కోసం గడ్డివామిలోని శనగపొట్టు మేత తీస్తుండగా ఒక్కసారిగా మేత ఉల్లిపడింది. శనగపొట్టు అంతా తన మీద పడటంతో ఊపిరాడక మృతిచెందింది. భర్త లక్ష్మీనారాయణరెడ్డి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు.

దేవునికడప చెరువులో బాలుడు మృతి



కడప (క్రైం), ఫిబ్రవరి 10 : స్నేహితులతో పాటు దేవునికడప చెరువులో ఈతకు వెళ్లిన మహ్మద్ (12) అనే బాలుడు శనివారం మృతి చెందాడు. ఖలీల్‌నగర్‌కు చెందిన మహబూబ్, ఆయేషాలకు నలుగురు సంతానం. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. సంతానంలో చివరివాడైన మహ్మద్ శనివారం మధ్యాహ్నం స్నేహితులతో కలిసి దేవునికడప చెరువులోకి ఈతకు వెళ్లాడు. చెరువులోకి దిగి ఈత రాకపోవడంతో గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న చిన్నచౌకు పోలీసులు, అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బంది సంఘటనాస్థలానికి చేరుకుని వెతకగా రాత్రి 7 గంటలకు మృతదేహం లభ్యమైంది. చిన్నచౌకు ఎస్‌ఐ మహ్మద్‌రఫీ, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

పాత సామాన్లకు అంటుకున్న నిప్పు



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

సికెదిన్నె, ఫిబ్రవరి 10: చింతకొమ్మదిన్నె మండలం మూలవంక వద్దగల పాత సామాన్ల గోడౌన్‌కు ప్రమాదవశాత్తు మంటలు అంటుకున్నాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అతి కష్టంపై శ్రమించి రెండు ఫైరింజన్ల సాయంతో మంటలను అదుపులోకి తీసుకు రావడం జరిగింది. వివరాల్లోకి వెళ్లితే మూలవంక వద్దగల వంకలో గుర్తు తెలియని వ్యక్తులు ఎండిన గడ్డికి మంట పెట్టడంతో అది అంటుకుంటూ వచ్చి మధ్యాహ్న సమయంలో పాత సామాన్లు గోడౌన్ వెనుకవైపు మంటలు అంటుకున్నాయి. ఆ సమయంలో ఎవరు లేకపోవడంతో ప్రమాదాన్ని ఎవరు గుర్తించలేకపోయారన్నారు. దట్టమైన పొగ అలుముకోవడంతో చుట్టుపక్కల వారు గమనించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు చెబుతున్నారు.

20 మద్యం బాటిళ్లు స్వాధీనం

- 1500 లీటర్ల నాటుసారా ఊట ధ్వంసం




మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్న ఎస్‌ఐ, నాటుసారా ఊటను పడేస్తున్న పోలీసులు

సంబేపల్లె, ఫిబ్రవరి 10: మండల పరిధిలోని శెట్టిపల్లె గ్రామం డీసీ వడ్డెపల్లెకు చెందిన రఘునాథ అనే వ్యక్తి వద్ద 20 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. విధి నిర్వహణలో భాగంగా శెట్టిపల్లెలో తనిఖీలు నిర్వహిస్తుండగా 180 మిల్లీలీటర్ల 20 బాటిళ్లను అమ్ముతుండగా పట్టుకొని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. డీసీ వడ్డెపల్లె సమీపంలో నాటుసారా తయారీ కేంద్రంపై పోలీసు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. సారా తయారీ కోసం డ్రమ్ముల్లో ఉంచిన 1500 లీటర్ల ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా మద్యం అమ్మకాలు నాటుసారా తయారీ వంటి కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చోరీ కేసులో నిందితుడు అరెస్టు

- నగదు స్వాధీనం చేసుకున్న సీఐ యుగంధర్



వివరాలు తెలుపుతున్న సీఐ, ఎస్‌ఐ

బద్వేలు టౌన్, ఫిబ్రవరి 10 : పట్టణంలోని సిద్దవటం రోడ్డు సమీపంలో ఉన్న బియ్యం దుకాణంలో నగదు చోరీ జరిగిన విషయం పాఠకులకు తెలిసిందే. బద్వేలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఈ సందర్భంగా బద్వేలు సీఐ యుగంధర్ మాట్లాడుతూ పట్టణంలోని సిద్దవటం రోడ్డులో ఈనెల 5వ తేదీ తెల్లవారుజామున బియ్యం దుకాణంలో చోరీ జరిగింది. రూ.2.40 లక్షలు చోరీకి గురైంది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేశామన్నారు. కాగా ఇందులో నిందితుడు గాలిపోతు రవిని శనివారం ఎన్జీవో కాలనీలోని టీస్టాల్ వెనుక వైపు అరెస్టు చేసి అతడి వద్ద ఉన్న రూ.2.40 లక్షలు నగదు, మరో కేసులో 11 గ్రాముల బంగారు వస్తువులు స్వాధీనం చేసుకున్నామని సీఐ యుగంధర్ తెలిపారు. గతంలో కూడా ఇతను దొంగతనం కేసులో నిందితుడిగా పట్టుబడ్డాడన్నారు. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు వీధుల్లో సంచరిస్తున్నప్పుడు పోలీసు వారికి తెలపాలన్నారు. అంతేకాకుండా ఎవరైనా ఊర్లకు వెళ్లే సమయంలో ఇంట్లో బంగారు వస్తువులు, నగదు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఇంటి ముందు ద్విచక్ర వాహనాలకు లాక్ వేసుకుని వాహనాలు భద్రపరచుకోవాలన్నారు. వీలైనంత త్వరగా వీధిచివర, వార్డుల్లో సీసీ కెమెరాలు అమర్చుకోవాలని సూచించారు.

మరియతల్లి కరుణించే కల్పవల్లి

- నవదిన ప్రార్థనల్లో డీన్ ఫాదర్ ప్రసాదరావు
- విద్యుద్దీపాల కాంతుల్లో లూర్దుమాత ఊరేగింపు



వీధుల్లో మరియతల్లి ఊరేగింపు



విద్యుద్దీపకాంతుల్లో మేరిమాత చర్చి

కడప (కల్చరల్), ఫిబ్రవరి 10 : విశ్వాసులకు మరియతల్లి కరుణించే కల్పవల్లిగా ఆదరిస్తుందని ఫాదర్ డీఎన్ ఎండీ ప్రసాదరావు అన్నారు. మరియాపురం లూర్దుమాత నవదిన ప్రార్థనల్లో భాగంగా శనివారం స్థానిక మరియాపురం పాత చర్చి ఆవరణంలో ప్రసాదరావు ప్రసంగించారు. ఆపదలో ఉన్న విశ్వాసుల బాధలను ఆలకించి వారి కష్టాలను తన కష్టాలుగా ఎంచుకుని బాధలను మటుమాయం చేయగల శక్తి మరియతల్లికే ఉందని అన్నారు. లూర్దుమాత వేడుకల్లో భాగంగా శనివారం సాయంత్రం నగర సంధ్య సర్కిల్ సమీపంలో గల డాన్‌బోస్కో ఐటీఐ చర్చి నుంచి పురవీధుల్లో లూర్దుమాత తేరు ప్రదర్శన జరిగింది.

ఆ మేరకు రంగురంగుల విద్యుద్దీపాల కాంతుల మధ్య కోటిరెడ్డిసర్కిల్, సీఎస్‌ఐ చర్చి, ఎన్టీఆర్ సర్కిల్, వన్‌టౌన్, రామక్రిష్ణ జూనియర్ కాలేజీ మరియాపురం ప్రధాన దారి మీదుగా మరియాపురం పాత బ్రిడ్జి వద్దకు ఊరేగింపుగా చేరుకుంది. కార్యక్రమంలో వందలాది మంది విశ్వాసులు తిరుణాల కమిటీ సభ్యులు, సమిష్టి దివ్య బలిపూజ కార్యక్రమం నిర్వహించారు.

జనసేన ఫ్లెక్సీల చించివేత

పోలీస్‌స్టేషన్ ఎదుట జనసేన, టీడీపీ నేతల నిరసన



పెనగలూరు పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

పెనగలూరు, ఫిబ్రవరి 10 : మండలంలో ఏర్పాటు చేసిన జనసేన ఫ్లెక్సీల చించివేతకు నిరసనగా శనివారం జనసేన, టీడీపీ నాయకులు పోలీస్‌స్టేషన్ వద్ద ధర్నా చేశారు. రెండు రోజుల నుంచి జనసేన ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను వైసీపీకి చెందిన కార్యకర్త చించివేస్తున్నాడు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని జనసేన, టీడీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ధర్నాకు దిగారు. శుక్రవారం తాము పోలీసులకు ఫిర్యాదు చేయగా ఫ్లెక్సీలు చించిన వైసీపీ కార్యకర్తను అదుపులోకి తీసుకుని వెంటనే ఎందుకు వదిలేశారని పెనగలూరు ఎస్‌ఐ సుభాష్ చంద్రబోస్‌తో వాగ్వాదానికి దిగారు. ఈ సమయంలో జనసేన, టీడీపీ నాయకులు భారీగా స్టేషన్ లోపలికి చొచ్చుకు రావడంతో ఒకానొక దశలో పరిస్థితి అదుపు తప్పింది. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయి పరిష్కరిస్తామని ఎస్‌ఐ తెలిపినప్పటికీ వారు శాంతించలేదు. ఫ్లెక్సీలను తానే చించేశానని, మళ్లీ అదే పనిచేస్తానని ఏం చేసుకుంటారో చేసుకోండి అని జనసేన నాయకులకు ఫోన్ చేయడమే కాకుండా వాట్సప్ గ్రూపులలో తీవ్రపదజాలంతో మెసేజ్‌లు పెడుతున్నాడని ఈ సందర్భంగా వారు ఎస్‌ఐకి తెలిపారు. వెంటనే అతడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో స్టేషన్ బయటకు వచ్చి స్టేషన్ ఎదురుగా టెంట్ వేసి ధర్నా చేశారు. 2 గంటల తర్వాత డీఎస్పీ ఫోన్ చేసి వారికి సర్దిచెప్పడంతో ధర్నాను విరమించారు. అనంతరం విలేకర్లతో జనసేన నాయకుడు జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర మాట్లాడుతూ జనసేన ఫ్లెక్సీలు మొదటిసారి చించివేసినప్పుడు ఎస్‌ఐకి తెలిపామని, రెండోసారి వేసిన ఫ్లెక్సీలను కూడా చించివేశారన్నారు. దానిపైన కూడా తెలిపినప్పటికీ నిందితుడు అధికార పార్టీకి చెందిన కార్యకర్త కావడం వల్ల పోలీసులు కేసు నమోదు చేయడం లేదని తెలిపారు. ఇప్పటికైనా దీనికి బాధ్యుడైన వైసీపీ కార్యకర్తపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాయలసీమ జోన్ కన్వీనర్, కో-కన్వీనర్లు జోగినేని మణి, పగడాల వెంకటేష్, మహిళా రీజనల్ కో-ఆర్డినేటర్ కుప్పాల జ్యోతి, టీడీపీ మాజీ శాప్ డైరెక్టర్ జయచంద్ర, మామిళ్ల రామయ్య, మైనారిటీ రాష్ట్ర కార్యదర్శి షామీర్, జిల్లా అధికార ప్రతినిధి కొత్త బాలకృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి కె.కళాచంద్ర, పార్లమెంటు నియోజకవర్గ తెలుగుయువత కార్యదర్శి రాంప్రసాద్ నాయుడు, నియోజకవర్గ కార్యనిర్వాహక కార్యదర్శి ధనయ్య, తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లెలో బీటెక్ రవి పుట్టినరోజు వేడుకలు

బండి రవికుమార్ కుటుంబానికి రూ.లక్ష ఆర్థికసాయం



వేంపల్లెలో బీటెక్ రవి జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న టీడీపీ నేతలు

వేంపల్లె, ఫిబ్రవరి 10: మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి జన్మదిన వేడుకలను వేంపల్లెలో శనివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ డైరెక్టర్ నిమ్మకాయల దర్బార్‌బాష ఆధ్వర్యంలో స్థానిక నాలుగురోడ్ల కూడలిలో కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. మండల అధ్యక్షుడు మునిరెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షబ్బీర్, పట్టణ అధ్యక్షుడు ఆర్వీ రమేష్, ఎస్‌బి జయచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు. మైనార్టీ కన్వీనర్ తెలంగాణ వలి ఆధ్వర్యంలో అనాథ శరణాలయంలో అన్నదానం చేశారు. స్థానిక క్రిస్టియన్ కాలనీలో బండి రవికుమార్ కుటుంబానికి బీటెక్ రవి లక్ష రూపాయల ఆర్థికసాయం చేశారు. ఆటోడ్రైవర్‌గా పనిచేసే రవి ఆర్థిక సమస్యలతో మృతి చెందడంతో కుటుంబాన్ని ఆదుకుంటానని హామీ ఇచ్చారు. ఆ మేరకు శనివారం లక్ష రూపాయల ఆర్థికసాయం అందించినట్లు మండల కన్వీనర్ మునిరెడ్డి తెలిపారు.

పకడ్బందీగా నవోదయ ప్రవేశ పరీక్షలు



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో హరిప్రసాద్

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 10: మదనపల్లె సమీపంలోని జవహర్ నవోదయ విద్యాలయలో 9వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి విద్యార్థులకు ప్రవేశ పరీక్షలు నిర్వహించారు. శనివారం పట్టణంలో జడ్పీహైస్కూల్లోని మూడు సెంటర్లలో 9వ తరగతి ప్రవేశ పరీక్షలు నిర్వహించగా ఆర్డీవో హరిప్రసాద్ ఈ మూడు సెంటర్లను విజిట్ చేసి పరీక్ష నిర్వహిస్తున్న తీరుతెన్నులు పరిశీలించారు. మూడు సెంటర్లకు కలిపి మొత్తం 857 మంది విద్యార్థులకు కేటాయించగా, 591 మంది హాజరయ్యారు. అలాగే జవహర్ నవోదయ విద్యాలయలో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశ పరీక్షకు గాను 678 మంది పరీక్షకు హాజరు కావాల్సి వుండగా 494 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ పరీక్షలను నవోదయ ప్రిన్సిపాల్ గోవిందరావు, ఎంఈవో ప్రభాకర్ రెడ్డి, జడ్పీ హెచ్ఎం సుబ్బారెడ్డి పర్యవేక్షించారు.

రైల్వే ఇంజనీరింగ్ సిబ్బంది విధుల బహిష్కరణ



విధులు బహిష్కరించిన రైల్వే ఇంజనీరింగ్ ఉద్యోగులు

నందలూరు, ఫిబ్రవరి10 : నందలూరు రైల్వే కేంద్రంలో శనివారం ఉదయం స్థానిక రైల్వే ఇంజనీరింగ్ సిబ్బంది విధులు బహిష్కరించారు. స్థానిక రైల్వే బుకింగ్ కార్యాలయం వద్ద రైల్వే ట్రాక్‌మన్ రాహుల్ ప్రసాద్, జీఆర్‌పీ కానిస్టేబుల్ నాగార్జున మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో నాగార్జున, రాహుల్ ప్రసాద్‌పై దాడి చేయడంతో గొడవ పెద్దదైంది. బాధిత కార్మికుడికి మద్దతుగా రైల్వే ఇంజనీరింగ్ ఉద్యోగులు విధులు బహిష్కరించారు. రైల్వే కార్మిక నేతలు, పీడబ్ల్యూఐ సురేష్, జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ సుభాన్ ఇద్దరికీ సర్ది చెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

ఆర్టీసీ అధికారులు, సిబ్బంది ర్యాలీ

పీలేరు, ఫిబ్రవరి 10: జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా శనివారం పీలేరు ఆర్టీసీ డీఎం బండ్ల కుమార్ నేతృత్వంలో అధికారులు, సిబ్బంది పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. రోడ్డు భద్రత, ప్రయాణంలో పాటించాల్సిన నియమాలను తెలిపే ప్లకార్డులు చేతబూని స్థానిక ఆర్టీసీ బస్టాండు నుంచి నాలుగు రోడ్ల కూడలి, పంచాయతీ కార్యాలయం వరకు వారు ర్యాలీ చేపట్టారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించి సురక్షితంగా ఇళ్లకు చేరాలని వారు వాహనదారులు, డ్రైవర్లకూ సూచించారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు రాజు, రమణ, తదితరులు పాల్గొన్నారు.

సారా కేసులో మహిళ అరెస్టు

గుర్రంకొండ, ఫిబ్రవరి 10: అక్రమంగా సారా విక్రయిస్తున్న మహిళను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ నాగార్జున్‌రెడ్డి తెలిపారు. మండలంలోని చెర్లోపల్లె పంచాయితీ గామిరెడ్డిగారిపల్లెకు చెందిన లక్షుమ్మ సారా విక్రయిస్తుండడంతో పోలీసులు పట్టుకున్నారు. ఆమె వద్ద నుంచి 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

'పదోన్నతుల్లో రిజర్వేషన్‌ను పారదర్శకంగా అమలు చేయాలి'



డీఈఓకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 10 : ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల పదోన్నతుల్లో రిజర్వేషన్‌ను పారదర్శకంగా అమలు చేయాలని ఆ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంటు మేకల శివార్జున డిమాండ్ చేశారు. శనివారం డీఈఓ కార్యాలయంలో డీఈఓ అనురాధను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల స్థాయి ని దృష్టిలో ఉంచుకుని తెలుగు మీడియాన్ని కూడా ప్రవేశ పెట్టే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యారంగ అభివృద్ధికి ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం కూడా సహకరిస్తుందన్నారు. ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర నాయకులు శేషగిరిరావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుదర్శన్‌బాబు, మేంద్రగుత్తి గంగరాజు, కార్యదర్శులు మంజుల, సు రేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆర్జేడీ క్రిష్ణారెడ్డికి ఘనంగా వీడ్కోలు



ఆర్జేడీ ఎంవీ క్రిష్ణారెడ్డిని సత్కరిస్తున్న స్కౌట్ అండ్ గైడ్ ప్రతినిధులు, మోడల్ స్కూళ్ల ప్రిన్సిపాళ్లు

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 10 : ఆర్జేడీ ఎంవీ క్రిష్ణారెడ్డికి స్కౌట్‌అండ్ గైడ్స్ ఉపాధ్యాయులు, మోడల్ స్కూలు ప్రిన్సిపాళ్లు ఘనంగా వీడ్కోలు పలికారు. శనివారం కడప నగరం స్కౌట్ అండ్ గైడ్స్ కార్యాలయంలో క్రిష్ణారెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ వృత్తిలో క్రమశిక్షణ, పారదర్శకత, నిబద్ధతో పనిచేసిన వ్యక్తి క్రిష్ణారెడ్డి అని కొనియాడారు. అనంతరం క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ తన వృత్తి నిర్వహణలో సహకరించిన విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా ఓపెనప్ స్కూలు కో ఆర్డినేటరు శ్రీనివాసరాజు, ప్రధానోపాధ్యాయులు నరసింహారెడ్డి, వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా రమేష్, ఫణీంద్ర



రమేష్



ఫణీంద్ర

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 10 : ఆంధ్రప్రదేశ్ స్కూలు ఎడ్యుకేషన్ నాన్ టీచింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎం.రమేష్, కె.సాయిఫణీంద్ర ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. శనివారం డీఈఓ కార్యాలయంలో ఏపీ ఎస్‌ఈ నాన్ టీచింగ్స్ సంఘం ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో డీఈఓ కార్యాలయం, ఆర్జేడీ కార్యాలయం, సమగ్ర శిక్ష కార్యాలయం ఉప విద్యాశాఖాధికారి కార్యాలయ బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు. ఈ ఎన్నికల్లో జిల్లా గౌరవాధ్యక్షుడు మురళీమోహన్, కోశాధికారిగా వెంకటహరి, ఎంపికయ్యారు. వీరితో పాటు మరికొందరిని ఎంపిక చేశారు.

నేడు శిల్పారామంలో నృత్య ప్రదర్శనలు

పులివెందుల రూరల్, ఫిబ్రవరి 10: పట్టణంలోని శిల్పారామంలో ఆదివారం నృత్య ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు శిల్పారామం పరిపాలన అధికారి సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పులివెందుల మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప సహకారంతో మదనపల్లెకు చెందిన సూర్య డ్యాన్స్ అకాడమీ చిన్నారులచే క్లాసికల్, జానపద, వెస్టర్న్ డ్యాన్స్‌లు ఉంటాయన్నారు. కావున ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సుధాకర్ కోరారు.

'ప్రభుత్వ అరాచకాలపై లోకేశ్ శంఖారావం'

చెన్నూరు, ఫిబ్రవరి 10 :ప్రభుత్వ మొండి వైఖరి, మంత్రుల అరాచకాలకు వ్యతిరేకంగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌బాబు శంఖారావం చేపడుతున్నాడని జిల్లా అధికార ప్రతినిధి మున్నూరు అక్బర్ అన్నారు. శనివారం చెన్నూరు పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రజలు ధరలు, పన్నులతో యువత నిరుద్యోగంతో బాధపడుతున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుల చలపతి, మైనార్టీ జిల్లా కార్యదర్శి మంజూర్‌అహ్మద్, సుభాని, గౌస్‌పీర్ తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికలకు సిద్ధం కావాలి

● ఎలాంటి దుర్ఘటనలకు తావు లేకుండా ప్రణాళికాబద్ధంగా బందోబస్తు ఏర్పాటు చేయాలి ● పోలీసు అధికారులకు ఎస్పీ దిశానిర్దేశం



మాట్లాడుతున్న ఎస్పీ సిద్దార్థ కౌశల్

కడప (క్రైం), ఫిబ్రవరి 10:రానున్న సార్వత్రిక ఎన్నికలకు పోలీసు అధికారులు, సిబ్బంది సర్వసన్నద్ధం కావాలని, ఎలాంటి ఘటనలకు తావు లేకుండా ముందస్తు ప్రణాళికతో బందోబస్తు ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీ సిద్ధార్థ కౌశల్ ఆదేశించారు. వర్క్‌షాపులో భాగంగా శనివారం స్థానిక పెన్నార్ కాన్ఫరెన్స్ హాలులో మైదుకూరు, బద్వేలు అసెంబ్లీ నియోజకవర్గాల పోలీసు అధికారులు, సిబ్బందికి ఎన్నికల నేపథ్యంలో కార్యాచరణ ప్రణాళికపై జిల్లా ఎస్పీ దిశా నిర్దేశనం చేశారు. ఈ సందర్భంగాఎస్పీ మాట్లాడుతూ క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు, ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గత ఎన్నికల్లో నేరాలకు పాల్పడ్డ వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. మద్యం, నగదుతో ఓటర్లను ప్రలోభ పెట్టే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ట్రబుల్‌మాంగర్లు, రౌడీషీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. గ్రామాల ప్రజలతో సత్సంబంధాలు సమకూర్చుకుని సమస్యల గురించి సమాచారం సేకరిస్తుండాలన్నారు. ఏదైనా సంఘటన జరిగినప్పుడు వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) లోసారి సుధాకర్, ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్ఎస్ఎస్‌వీ క్రిష్ణారావు, మైదుకూరు డీఎస్పీ ఎస్.ఆర్. వంశీధర్ గౌడ్, ఎస్ఐలు, సెక్టారు పోలీసు ఆఫీసర్లు, స్పెషల్ బ్రాంచ్, ఎలక్షన్ సెల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐఆర్ వెంటనే ప్రకటించాలి



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న రామాంజనేయులు

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 10 : ఎన్నికల నోటిఫికేష్ వచ్చే అవకాశం ఉన్నందున ఉద్యోగ ఉపాధ్యాయులకు 35 శాతం ఐఆర్‌ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు డిమాండ్ చేశారు. శనివారం ముఖ్య కార్యకర్తల సమావేశం కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా మాట్లడతూ ప్రభుత్వం మేనిఫెస్టోలో ఉద్యోగ ఉపాధ్యాయులకు సకాలంలో పీఆర్సీ అమలు చేస్తామని చెప్ప జరిగిందని, అయితే పీఆర్సీ అములచేయకపోగా 11వ పీఆర్సీ బకాయలు కూడా ఇంతవరకు చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం ఐఆర్ ఇచ్చి ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు మురళి, జిల్లా గౌరవ అధ్యక్షులు శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్ర, నాయకులు క్రిష్టఫర్ జాన్, రాజగోపాల్‌రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

వైవీయూలో ప్రొఫెసర్లకు పదోన్నతులు



పదోన్నతి పొందిన వారితో వైస్‌చాన్సలర్, రిజిస్ట్రార్, ప్రిన్సిపాల్

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 10 :వైవీయూలో అసిస్టెంటు ప్రొఫెసర్లు ఐదుగురు కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీం ద్వారా ప్రొఫెసర్లుగా పదోన్నతులు అందుకున్నారు. అలాగే ఒక అసిస్టెంటు ప్రొఫెసరు అసోసియేట్ ప్రొఫెసరుగా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ చింతా సుధాకర్, రిజిస్ట్రార్ వైపీ వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఎస్.రఘునాథరెడ్డి వారిని అభినందించారు. గతనెల 29న రాష్ట్ర, రాష్ట్రేతర విశ్వవిద్యాలయాల సబ్జెక్టుల నిపుణులతో ఇంటర్వ్యూలు జరిగాయి. ప్రొఫెసర్లుగా ఎంపికైన వారిలో మెర్సీ విజేత (ఇంగ్లీషు) ఎల్. మాధవి, (మేథమేటిక్స్), పార్వతి - పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, క్రిష్ణరావు- కెమిస్ట్రీ, రియాజున్నీసాకు - బయోటెక్నాలజీ అండ్ బయో ఇన్‌ఫర్‌మేటిక్స్ ఉన్నారు. అలాగే ఫైన్‌ఆర్ట్స్ విభాగానికి డాక్టర్ మృత్యుంజయరావు, అసిస్టెంటు ప్రొఫెసరు నుంచి అసోసియేట్ ప్రొఫెసరుగా పదోన్నతి అందుకున్నారు.

రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం



బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో మాధవీరెడ్డి, సుంకర శ్రీనివాస్...



చెన్నూరు: పుత్తా సమక్షంలో టీడీపీలో చేరిన మోడాల గ్రామస్థులు

● టీడీపీ కడప నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాధవీరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 10 : రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ కడప నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆర్.మాధవీరెడ్డి, జనసేన ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటరు సుంకర శ్రీనివాస్ తెలిపారు. శనివారం కడప నగరం 9వ డివిజన్ కో ఆపరేటివ్ కాలనీలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు గోవర్ధనరెడ్డి, బి.హరిప్రసాద్ పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందించారు. అలాగే ప్రభుత్వ వైఫల్యాలను తెలుపుతూ టీడీపీ ప్రభుత్వం వచ్చినాక చేపట్టే అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షులు శివకొండారెడ్డి, నాయకులు అమీర్‌బాష, శివరాం, శ్రీనివాస్, గంగాధర్, రాము, బాలయ్య, జిలానీ, అంజి, సునీత, గౌతంతో పాటు జనసేన, టీడీపీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఇచ్చేది సన్నబియ్యమా.. చౌకబియ్యమా?: పుత్తా

చెన్నూరు, ఫిబ్రవరి 10 :మీకు ఇచ్చేది సన్నబియ్యమా లేక చౌక దుకాణ బియ్యమా అని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి రాచిన్నాయపల్లె గ్రామస్తులను అడిగారు. శనివారం మండలంలోని రాచిన్నాయపల్లె, మోడాల గ్రామాల్లో బాబుతోనే భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాచిన్నాయపల్లె ఎస్సీ కాలనీలో జనంతో మాట్లాడారు. టీడీపీని గెలిపిస్తే ఎప్పుడు ఏ సమస్య వచ్చినా ఒక్క ఫోను చేస్తే తాము మీ ఇంటి వద్దకే వచ్చి మీ సమస్యలను పరిష్కరి స్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

టీడీపీలో వంద కుటుంబాలు చేరిక

రాచిన్నాయపల్లెలో మాజీ సర్పంచ్ శెట్టూరు శేఖర్ ఆధ్వర్యంలో దాదాపు 40 కుటుంబాలు టీడీపీలో చేరాయి. అలాగే రామనపల్లె పంచాయతీ మోడాల గ్రామంలో 60 కుటుంబాలు టీడీపీ కండువా వేసుకున్నారు. వారందరినీ పుత్తా టీడీపీలోకి ఆహ్వానించారు. మండల కన్వీనరు విజయ భాస్కరరెడ్డి, రాచిన్నాయపల్లె టీడీపీ సీనియర్ నేతలు కనుపర్తి గిరి, శివారెడ్డి, శ్రీహరి, కేశవరెడ్డి, వెంకటరమణారెడ్డి, హుసేన్, సుభాన్, వెంకటేశ్, నరసింహులు రామనపల్లె నేతలు క్లస్టర్ ఇన్‌చార్జ్ బుజ్జన్న, క్రిష్ణారెడ్డి, ముండ్ల నరసింహారెడ్డి, వేల్పుల సుబ్రమణ్యం, మన్నూరు అక్బర్, భవానీ ఆచారి, మణిరాజ్, మునిరెడ్డి, మోడాల నేతలు చిన్న, సుబ్బరాయుడు, ప్రసాద్, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు 'భవిష్యత్తుకు గ్యారంటీ'

వల్లూరు, ఫిబ్రవరి 10 :దిగువపల్లె గ్రామంలో ఆదివారం బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి టీడీపీ ఉపాధ్యక్షుడు కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుత్తా నరసింహారెడ్డి వస్తున్నారని, కావున మండలంలోని టీడీపీ అభిమానులు, కార్యకర్తలు దిగువపల్లె గ్రామానికి ఆదివారం రావాలని ఈ సందర్భంగా కోరారు.

లక్ష్మీనరసింహుడికి ప్రత్యేక పూజలు

బద్వేలు రూరల్, ఫిబ్రవరి 10 : బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివరి దర్శనానికి వచ్చిన భక్తులకు మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు.

దేశంలోనే గొప్ప విద్యాసంస్థగా ఏఎఫ్ఏయూ

● ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసరు హేమచంద్రారెడ్డి

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 10 : దేశంలోనే గొప్ప విద్యాసంస్థగా వైఎస్ఆర్ హార్టికల్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయం నిలుస్తోందని ఏపీ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసరు హేమచంద్రారెడ్డి పేర్కొన్నారు. శనివారం కడప నగరం డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో నాలుగవ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వైస్ చాన్సలర్ అంజనేయ ప్రసాద్, రిజిస్ట్రారు సురేంద్రనాథరెడ్డి ఆధ్వర్యంలో ఈ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వైవీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసరు వెంకటసుబ్బయ్య, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఈశ్వర్‌రెడ్డి, డిప్యూటీ రిజిస్ట్రారు రాజేష్‌కుమార్‌రెడ్డి, సూపరింటెండెంట్ పవన్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజలకు భరోసా కల్పించేందుకే టీడీపీ శంఖారావం



మాట్లాడుతున్న టీడీపీ నేతలు

పులివెందుల టౌన్, ఫిబ్రవరి 10: రాష్ట్ర ప్రజలకు భరోసా కల్పించేందుకే టీడీపీ శంఖారావం అనేక కీలక ప్రచారానికి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ శ్రీకారం చుట్టారని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. శనివారం స్థానిక టీడీప కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ నారాలోకేష్ రాష్ట్రవ్యాప్తంగా పర్యటించనున్నారన్నారు.ఆయా ప్రాంతాల్లోని ప్రజల సమస్యలను నోట్ చేసుకొని అధికారంలోకిరాగానే అన్ని సమస్యలకు పరిష్కారం చూపడమే కాకుండా ఆ సమస్యలు మళ్లీ ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకుంటారన్నారు. జగన్‌రెడ్డి ప్రభుత్వంలో బాధితులుగా మారిన అన్ని వర్గాల ప్రజలకు యువగళం పాదయాత్ర ద్వారా నారా లోకేష్ పాదయాత్ర ద్వారా నారాలోకేష్ భరోసా ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు విశ్వనాథ్‌రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, రాఘవరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, గురివిరెడ్డి, ప్రదీప్‌రెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ ఎస్సీ సెల్ మహిళా అధ్యక్షురాలిగా భాగ్యలక్ష్మి



నియామక పత్రం అందిస్తున్న లింగారెడ్డి

కమలాపురం రూరల్, ఫిబ్రవరి 10 : టీడీపీ ఎస్సీ సెల్ మహిళా అధ్యక్షురాలిగా ఎం.భాగ్యలక్ష్మి నియమించినట్లు ఈ సందర్భంగా పార్లమెంటు అధ్యక్షుడు లింగారెడ్డి చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నట్లు భాగ్యలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆమె మాట్లాడారు. టీడీపీలో మహిళలకు అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు ఇదే నిదర్శనమన్నారు. మైనార్టీ అధ్యక్షులు ఖాదర్‌బాషా, నియోజకవర్గ కాపు కార్యదర్శి దాది రామయ్య, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలు కుటుంబాలు చేరిక

పులివెందుల టౌన్, ఫిబ్రవరి 10: పులివెందులలో శనివారం పలు కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో చేరాయి. శనివారం స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాసులరెడ్డి కండువా వేసి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. వైఎస్ షర్మిల రాకతో రాష్ట్ర కాంగ్రెస్ దిశాదశ మారిందని శ్రీనివాసులరెడ్డి అన్నారు.

డిప్యూటీ సీఎం తమ్ముడి తీరు అభ్యంతరకరం

● ఓటమి భయంతోనే వ్యక్తిగత దూషణలు
● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్



విలేకరులతో మాట్లాడుతున్న హరిప్రసాద్

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 10 :తమ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, కడప ఇన్‌చార్జ్ మాధవీరెడ్డిలను డిప్యూటీ సీఎం తమ్ముడు అహ్మద్‌బాషా వ్యక్తిగతంగా దూషించడం, రౌడీల్లా ప్రవర్తించడం అభ్యంతర కరమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బి.హరిప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం కడప నగరం హరిటవర్స్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏ పార్టీ నాయకులైనా పార్టీపరంగా విమర్శలు చేయవచ్చు కానీ వ్యక్తిగతంగా మాట్లాడడం అభ్యంతకరమని, దాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తమ పార్టీ నాయకుడిపై వైసీపీ నాయకులు దాడి చేశారని తెలిసి శ్రీనివాసరెడ్డి పోలీసుస్టేషన్ వెళితే అక్కడ డిప్యూటీ సీఎం తమ్ముడు అహ్మద్‌బాషా తన మందీ మార్బలంతో పోలీసుస్టేషన్‌పై దాడి చేసి పోలీసులను దుర్భాషలాడడం, అక్కడే ఉన్న శ్రీనివాసరెడ్డిని దూషిచడం చూస్తుంటే వారికి ఓటమిభయం పట్టుకుందన్నారు. పోలీసు స్టేషన్‌లో డిప్యూటీ సీఎం తమ్ముడు దుర్భాషలాడుతుంటే పోలీసులు ప్రేక్షకపాత్ర పోషించడం బాధాకరమన్నారు. కడపలో ప్రశాంత వాతావరణం ఉందని, దాన్ని భగ్నం చేయడానికి అంజద్‌బాషా తమ్ముడు ప్రయత్నిస్తున్నాడన్నారు. ఆయన ఆటలు సాగవన్నారు. తాము కూడా 'సై అంటే సై' అనడానికి సిద్ధంగా ఉన్నామని, తాము చేతగానివారం కాదని హెచ్చరించారు. అయితే తమ నేత చంద్రబాబు ఆ సంస్కృతి తమకు నేర్పించలేదన్నారు. కాబట్టే మౌనంగా ఉన్నామన్నారు. టీడీపీ నాయకులు గోపిశెట్టి నాగరాజు, గంధం ప్రసాద్, పాణ్యం రామ్మోహన్, కరుణానిధి తదితరులు పాల్గొన్నారు.

కోవరంగుట్టపల్లిలో బీజేపీ 'పల్లెకు పోదాం'



కరపత్రాలు పంపిణీ చేస్తున్న శశిభూషణ్‌రెడ్డి తదితరులు

సింహాద్రిపురం, ఫిబ్రవరి 10: మండలంలోని కోవరంగుట్టపల్లి గ్రామంలో శనివారం పల్లెకు పోదాం కార్యక్రమం బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి ఆధ్వర్యం లో నిర్వహించారు. ఈ సందర్భంగా మోదీ అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు నవీన్, హరికృష్ణ, శంకరయ్య, అఖిల్, శీను పాల్గొన్నారు.

బీజేపీ సంక్షేమ పథకాల కరపత్రాలు పంపిణీ

చక్రాయపేట, ఫిబ్రవరి 10: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల కరపత్రాలను బీజేపీ నాయకులు పంపిణీ చేశారు. శనివారం మండంలోని నెర్సుపల్లె, చిలేకాంపల్లె గ్రామాలలో ప్రజలకు కరపత్రాలు అందించి అవగాహన కల్పించారు. క్యాలెండర్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ బీజేపీ నాయకులు, నేషనల్ కౌన్సిల్ మెంబర్ రామచంద్రారెడ్డి, మండల అధ్యక్షుడు విజయకుమార్, బీజేవైఎం జిల్లా వైస్ ప్రెసిడెంట్ దశరథ, బీజేవైఎం నాయకులు రెడ్డిసాయి, వేణు, కిసాన్ మోర్చా నాయకులు రామచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న యువత

కడప (మారుతీనగర్), ఫిబ్రవరి 10 : రక్తదానం ప్రాణదానంతో సమానమని నెహ్రూ యువకేంద్ర జిల్లా యువ అధికారి మణికంఠ పేర్కొన్నారు. జేబీవీఎస్ ది ప్రిజర్వర్ సేవా సమితి ఆధ్వర్యంలో ప్రాజెక్టు ఔషధ సమర్పణలో భాగంగా శనివారం స్థానిక నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల, కడప యూత్ హాస్టలులో రెండు రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మణికంఠ హాజరై మాట్లాడారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం ఎంతో అవసర మవు తుందని, యువకులు ఎంతో ఉన్నతాశయంతో రక్తదానం చేయడానికి ముందుకు రావడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వలంటీరు, సేవాసమితి వ్యవస్థాపకులు అశోక్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటరు సుబ్బనరసయ్య, రిమ్స్ సిబ్బంది, సమితి సభ్యులు ఆయేషా, ప్రియ, మహిత, సులేమాన్, యుగంధర్, మునివర్ధన్, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు నెహ్రూ పార్కులో సినీ సంగీత విభావరి

కడప (కల్చరల్), ఫిబ్రవరి 10: గాన గంధర్వుడు స్వర్గీయ ఘంటసాల వెంకటేశ్వరరావు 50వ వర్ధంతి సందర్భంగా కడప రాగరంజని ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో ఈనెల 11న సాయంత్రం 6 గంటలకు నెహ్రూ పార్క్‌లో ఘంటసాల వర్ధంతిని నిర్వహించనున్నట్లు రాగరంజని ఆర్కెస్ట్రా నిర్వాహకుడు, గాయకులు.. రేడియో ఆర్టిస్ట్ మచ్చా నరసింహాచారి, అంజి తెలిపారు. ముఖ్య అతిథిగా నగర మున్సిపల్ కమిషనర్ జి.సూర్యసా యి ప్రవీణ్ చంద్ హాజరుకానున్నట్లు తెలిపారు. అనంతరం సినీ సంగీత విభావరి కార్యక్రమం ఉంటుందన్నారు. కావున ప్రతి ఒక్కరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

క్యాన్సర్ కేర్ ఆసుపత్రి వైద్య సేవలు ఎప్పుడు: సీపీఐ



ఆసుపత్రి సిబ్బందితో మాట్లాడుతున్న వెంకటశివ

కడప (సెవెన్‌రోడ్స్), ఫిబ్రవరి 10:రిమ్స్ పరిధిలోని క్యాన్సర్ కేర్ ఆసుపత్రి వైద్య సేవలు ఎప్పుడోనని సీపీఐ నగర కార్యదర్శి ఎస్.వెంకటశివ, నగర కార్యవర్గ సభ్యులు టక్కోలి మనోహర్‌రెడ్డి, పి.మల్లికార్జున ప్రశ్నించారు. శనివారం రిమ్స్ పరిసర ప్రాంతాల్లో అందుతున్న వైద్య సేవలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటశివ మాట్లాడుతూ సీఎం శంకుస్థాపన చేసి రెండు నెలలు అవుతున్నా ఇప్పటి వరకు కనీసం ఆసుపత్రి ఓపీ వైద్య సేవలు ప్రారంభించకపోవడం దారుణమన్నారు. మెంటల్ హెల్త్ కేర్ ఆసుపత్రిలో రోగులకు కనీస వసతులు మెరుగుపరచాలన్నారు. క్యాన్సర్, మెంటల్ ఆసుపత్రిల్లో వైద్య సేవలకు అవసరమయ్యే సిబ్బంది ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చి దరఖాస్తులు స్వీకరించినా సిబ్బంది నియామకం ఎందుకు చేపట్టలేదన్నారు.

'ఆ కౌన్సిలర్ బారి నుంచి ప్రాణ రక్షణ కల్పించండి'

కడప (మారుతీనగర్), ఫిబ్రవరి 10: నివాస స్థల విషయమై న్యాయం చేయాలని కోరిన పాపానికి న్యాయం చేయకపోగా తన ప్రాణానికే ముప్పు వాటిల్లేలా వ్యవహరిస్తున్న ప్రొద్దుటూరుకు చెందిన కౌన్సిలర్ బారి నుంచి తనకు ప్రాణరక్షణ కల్పించాలని బాధితుడు ప్రవీణ్‌రెడ్డి కోరారు. శనివారం కడపలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను మూడు సెంట్ల స్థలం కొనుగోలు చేసినట్లు తెలిపారు. కొనుగోలు చేసిన తరువాత తాను కొన్న స్థలానికి సంబంధించినవి నకిలీ డాక్యుమెంట్లని తెలిసిందన్నారు. దీంతో న్యాయం చేయాలని కౌన్సిలరును సంప్రదించగా తొలుత సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, అయితే ముందుగా నగదును చెల్లించాలని డిమాండ్ చేశారన్నారు. దీనిపై తనను ఒత్తిడి చేస్తున్నాడని, జిల్లా అధికారులు స్పందించి తనకు న్యాయం చేయడంతో పాటు ప్రాణరక్షణ కల్పించాలని కోరారు.

'ప్రపంచ పీడిత ప్రజల విముక్తి ప్రదాత అంబేడ్కర్'

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 10 :ప్రపంచ పీడిత ప్రజల విముక్తి ప్రదాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని ప్రముఖ అంబేడ్కర్ వాది మాస్టర్ ఇంగిలాల రామచంద్రరావు పేర్కొన్నారు. శనివారం కడప నగరం ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో అంబేడ్కర్ సిద్ధాంత అధ్యయన తరగతులను బోధించడానికి వచ్చిన ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోని పీడిత ప్రజలందరికీ విముక్తి కలుగజేసిన మహనీయుడు బీఆర్ అంబేడ్కర్ అని కొనియాడారు. శతాబ్దాల తరబడి విద్య, ఉద్యోగాలకు దూరమై బతుకుతున్న ఎస్సీ ప్రజలకు కొన్ని ప్రోత్సాహకాలను భారత రాజ్యాంగంలో కల్పించడం ద్వారా ఈ రోజు అంతో ఇంతో ఆత్మగౌరవంతో బతుకుతున్నారంటే దానికి అంబేడ్కర్ కారణమని తెలిపారు. అంబేడ్కర్ మిషన్ వ్యవస్థాపక సభ్యులు లెనిన్ ప్రసాద్, బండి రమేష్‌కుమార్, ఓబులేసు, రాజశేఖర్, మదన్‌కుమార్, వినోద్‌కుమార్, నవీన్‌కుమార్, జై భీం మాలమహాసేన వ్యవస్థాపక అధ్యక్షులు సంపత్‌కుమార్, చైతల్య, అడ్వకేట్ జాషువా పాల్గొన్నారు.

బుద్ధటౌన్ షిప్‌లో వసతులు కల్పించాలి

కడప(కలెక్టరేట్), ఫిబ్రవరి 10: బుద్ధటౌన్ షిప్ లే అవుట్‌లో బ్రోచర్ లో సూచించిన విధంగా సౌకర్యాలు కల్పించాలని బుద్ధటౌన్ షిప్ ఓనర్సు అసోషియేషన్ నేతలు డిమాండ్ చేశారు. శనివారం కలెక్టరేట్‌లో కాలనీవాసులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసుల రెడ్డి, బాల బయిపురెడ్డిలు మాట్లాడుతూ లే అవుట్ పూర్తి స్థాయిలో ప్లాన్ అప్రూవల్ ఉండడంతో 200 మంది ఇళ్లు కట్టించుకున్నారన్నారు. 2017లో లే అవుట్‌లో క్లబ్‌హౌస్, స్విమ్మింగ్ పూల్, సెటిల్ కోర్టు, పార్కింగ్ కాంప్లెక్స్, టెంపుల్స్, బ్యూటిఫికేషన్‌లతో కట్టించి 2023 జూలై నాటికి నిబంధనల మేరకు టౌన్ షిప్ కమిటీకి అప్పగిస్తామన్నారు. ఇపుడు గడువు పూర్తి అయినప్పటికీ సధుపాయాలు పూర్తి చేయక పోగా, ఇప్పటి వరకు నిర్మించిన సౌకర్యాలను కూడా బిల్డర్ అమ్ముకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇదేమిటని ప్రశ్నిస్తే అధికార పార్టీ నేతలు రాజకీయ ఒత్తిళ్లు, బెదిరింపులకు దిగడమే కాకుండా మీకు దిక్కున్న చోట చెప్పు కోండంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ జోక్యం చేసుకొని తమకు న్యాయం చేయాలన్నారు.

ఏపీలో ప్రజలు ప్రభుత్వాన్ని కూల్చబోతున్నారు

మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 10 : ఏపీలో జగన్ దోపిడీ ప్రభుత్వాన్ని ప్రజలు కూల్చబోతున్నారని మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. శనివారం నెహ్రూ రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం దిగిపోయే ముందు ఢిల్లీకి పోయి రాష్ట్రానికి ప్రత్యేక హోదా అడగడానికి ఢిల్లీ పర్యటనకు వెళ్లానని చెబితే రాష్ట్ర ప్రజలు నమ్మే పరిస్థితి లేదని కేవలం తన కేసుల గురించి మాట్లాడటం కోసమే జగన్ ఢిల్లీ పర్యటన అని మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఆరోపించారు. టీడీపీ, జనసేనలు కేంద్రంలోని బీజేపీతో పొత్తుల విషయం చర్చించడానికి వెళితే ఆ పొత్తులు ఎక్కడ ఖరారు అవుతాయోనని భయపడి పొత్తులు వొద్దని తాను ఎప్పటిలాగా బీజేపీకి సంపూర్ణంగా మద్దతు ఇస్తానని చెప్పుకొచ్చారన్నారు. పైకి పోలవరానికి నిధులు, విశాఖరైల్వేజోన్,రాయలసీమకు నిధులు లాంటి విషయాలు మాట్లాడుతున్నప్పటికీ ఆయన పర్యటన వెనుక అసలు కథ వేరుగా వుందన్నారు. త్వరలో ఏపీలో ప్రభుత్వం కూలిపోతోందన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందనుకున్న టీడీపీ జనసేనతోనే బీజేపీ చర్చలు జరుపుతున్నదన్నారు. అమిత్‌షా టీడీపీ జనసేనతో చర్చలు జరపడం పూర్తయిందన్నారు. అమిత్‌షాను కలవాలనుకున్నా ఆయన జగన్‌కు అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వలేదన్నారు. జగన్ దోపిడీ ప్రభుత్వాన్ని ఏపీ ప్రజలు కూల్చబోతున్నారన్నారు. సమావేశంలో మున్సిపల్ మాజీ వైస్‌ఛైర్మన్ కొండయ్య, మాజీ కౌన్సిలర్ వద్దిబాలుడు,ఎర్రన్న అమీర్‌బాషా, కట్టమీది మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో పెన్నానది వంతెన..!



అంధకారంలో ఉన్న పెన్నానది వంతెన

జమ్మలమడుగు, ఫిబ్రవరి 10: జమ్మలమడుగు పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో రెండు నెలల నుంచి విద్యుద్దీపాలు వెలుగడంలేదు. గతంలో ఏర్పాటు చేసిన విద్యుత్తు దీపాలు నాశిరకమైన తెచ్చి అమర్చారు. రెండు నెలల నుంచి పెన్నానది వంతెన ప్రాంతం అంధకారంగా మారడంతో ఆ ప్రాంతాన వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గూడెం చెరువు, ఒంటిమిద్దె, గండికోట, రాజీవ్‌నగర్ కాలనీ ప్రాంతాలకు అటు ముద్దనూరు వెళ్లే ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందిగా మారింది. రాత్రి సమయంలో అదే ప్రాంతం నుంచి దొంగలు జగనన్న కాలనీవైపు సంచరిస్తున్నట్లు ఆ ప్రాంత బాధితులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ సమస్యకు సంబంధించి మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్‌ను వివరణ అడుగగా తాను కొత్తగా వచ్చానని, ఆ ప్రాంతంలో ఎప్పుడు దీపాలు తెచ్చి ఏర్పాటు చేశారో విచారించి అందుకు సంబంధించిన సమస్యను పరిష్కరిస్తానని ఆయన తెలిపారు.

గెలుపోటములు సమానంగా స్వీకరించాలి

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 10 : క్రీడల్లో గెలుపోటములు సమానంగా స్వీకరించాలని బద్వేలు టీడీపీ యువ నేత రితీష్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం పోరుమామిళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణంలో ఎంపీటీసీ కల్వకూరి రమణ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి మెగా క్రికెట్ టోర్నమెంటు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా క్రికెట్‌ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో బద్వేలు మార్కెట్‌యార్డు మాజీ వైస్‌ఛైర్మన్ చెరుకూరి చెన్నరాయుడు, టీడీపీ నాయకులు కల్వకూరి నడిపి వెంకటసుబ్బయ్య, వెంకటసుబ్బయ్య, తెలుగుయువత అధ్యక్షుడు సీతాబాలాజీ, కల్వకూరి రమేష్ శ్రీకాంత్, కరీముల్లా,అన్వర్ పాల్గొన్నారు.

మున్సిపల్ సమావేశమెప్పుడో..?

మైదుకూరు, ఫిబ్రవరి 10 : నిబంధనల ప్రకారం ప్రతి 3 నెలలకు ఒక సారి జరపాల్సిన మున్సిపల్ సమావేశం మైదుకూరులో గడువు దాటినా జరపక పోవడం పలు విమర్శలకు తావిస్తోంది. మున్సిపల్‌లో అధికారపార్టీకి 12 మంది, ప్రతిపక్ష టీడీపీకి 11, జనసేనకు ఒక సభ్యుడు కావడంతో ప్రతి సమావేశం హుందాగా జరిగేది. కాగా గత ఏడాది నవంబర్ 2న నూతన మున్సిపల్ కార్యాలయంలో సమావేశం జరగగా అప్పటి నుంచి 3 నెలలు దాటినా సమావేశం ఏర్పాటుకు ప్రయత్నాలు జరగలేదు. అలాగే మున్సిపల్ ఛైర్మెన్ మాచనూరు చంద్ర,ఎమ్మెల్యే రఘురామిరెడ్డి మధ్య విభేదాలు తలెత్తడంతో మున్సిపల్ సమావేశాన్ని ఏర్పాటు చేయలేదనే వాదనలు వినిపిస్తున్నాయి. వచ్చేది వేసవి కాలం కావడంతో తాగునీరు, అలాగే పట్టణంలో పారిశుధ్యం, రోడ్లు తదితర మౌలిక వసతులపై చర్చించి పనులు చేపట్టాల్సిఉంది.

'తప్పుడు కూతలు కూస్తే వదిలిపెట్టం'

ఖాజీపేట, ఫిబ్రవరి 10: తప్పుడు కూతలు కూసిన డిప్యూటీ సీఎం సోదరుడు అహ్మద్‌బాషను వదిలిపెట్టబోమని టీడీపీ మైనార్టీ సెల్ సంయుక్త కార్యదర్శి కమలాపురం గౌస్‌మొద్దీన్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అహ్మద్‌బాష అహంకారాన్ని తగ్గించుకోకుంటే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. ఎంతో అనుభవం ఉన్న పోలిట్‌బ్యూరో సభ్యుడిని ఏకవచనంతో మాట్లాడితే కార్యకర్తలు తగిన బుద్ధిచెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో కరీముల్లా, అజర్‌హుసేన్, జాఫర్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహుడికి ప్రత్యేక పూజలు

బద్వేలు రూరల్, ఫిబ్రవరి 10 : మున్సిపల్ పరిధిలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు.

స్టీల్‌ప్లాంట్ సాధనకు భూపేశ్ పాదయాత్ర

● అడుగడుగునా బాణసంచా పేల్చుతూ స్వాగతాలు ● బ్రహ్మరథం పట్టిన ప్రజానీకం



జమ్మలమడుగు, కన్నెలూరు గ్రామాల మధ్య పాదయాత్రలో ప్రజలకు అభివాదం చేస్తున్న భూపేశ్‌రెడ్డి

జమ్మలమడుగు, ఫిబ్రవరి 10: జమ్మలమడుగులో టీడీపీ ఇన్‌చార్జి దేవగుడి భూపేశ్‌రెడ్డి కడప ఉక్కు మా హక్కు పాదయాత్ర చేపట్టారు. శనివారం ఉదయం 7.30 గంటలకు నారాపురం వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేసి మొక్కుకున్నారు. అనంతరం ఆలయం వద్ద నుంచి పాదయాత్ర ప్రారంభమైంది. నారాపురం వేంకటేశ్వరస్వామి వద్ద నుంచి పాదయాత్ర ప్రారంభించి పలగాడివీధి, అంబాభవానీ దేవాలయం వద్దకు చేరారు. అక్కడ అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో పూజలు చేసి మొక్కుకున్నారు. అక్కడి నుంచి మెయిన్‌బజార్, కూరగాయల మార్కెట్‌వీధి, బురుజు ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు, పాత బస్టాండులోని గాంధీ విగ్రహం మీదుగా ముద్దనూరు రోడ్డులోని ట్యాంకు వీధి, ఎత్తపువారి కాలనీ, కన్నెలూరుచేరారు. అక్కడ అల్పాహారం (టిఫిన్) చేసుకుని గొరిగెనూరు గ్రామం మీదుగా పాదయాత్ర ప్రారంభమైంది. ధర్మాపురం, దానవులపాడు చేరుకున్నారు. అక్కడ ప్రధాన రోడ్డు పక్కన మధ్యాహ్న భోజనం అనంతరం అక్కడి నుంచి దానవుల పాడు పెన్నానది నుంచి సున్నపురాళ్ల పల్లె గ్రామంలో చేరారు. సున్నపురాళ్లపల్లె గ్రామంలో సీనియర్ నాయకుడు కాటిరెడ్డి తదితరుల ఇంటికి ఆయన వెళ్లారు. ఈ సందర్భంగా బద్వేలు టీడీపీ నియోజకవర్గ నాయకుడు రితీష్ రెడ్డి పాదయాత్రలో పాల్గొని సంఘీభావం తెలిపారు. అనంతరం సున్నపురాళ్లపల్లె గ్రామం వద్ద భూపేశ్‌రెడ్డి చేస్తున్న పాదయాత్రకు టీడీపీ నాయకుడు సీఎం సురేష్‌నాయుడు సంఘీభావం తెలిపారు. అక్కడి నుంచి సున్నపురాళ్లపల్లె, కన్నెతీర్థం గ్రామాల మధ్య జగన్‌మోహన్‌రెడ్డి స్టీల్‌ప్లాంట్ కోసం రెండుసార్లు చేసిన శంకుస్థాపన లను భూపేశ్‌రెడ్డి సందర్శించారు. అక్కడి నుంచి సిరిగేపల్లె మీదుగా పాదయాత్ర ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, మాజీ ఎమ్మెల్సీలు దేవగుడి నారాయణరెడ్డి, శివనాథరెడ్డి, చదిపిరాళ్ల రామాంజనేయరెడ్డి, సర్పంచులు సుధాకర్ రెడ్డి, గురుశేఖర్‌రెడ్డి, మండలాధ్యక్షుడు సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, సీనియర్ నాయకుడు జయసింహారెడ్డి, గోనా పురుషోత్తంరెడ్డి, వాల్మీకి సేవా సంఘం అధ్యక్షుడు పెద్ద కంబయ్య, పెద్దదండ్లూరు సర్పంచ్ రామాంజనేయ రెడ్డి, గండ్లూరు నాగేశ్వరరెడ్డి, అబ్దుల్‌ఖాదర్, ముచ్చుమర్రి రామసుబ్బారెడ్డి, గూడెం చెరువు షేక్ ఖాదర్, బాలు, శివారెడ్డి, సంతోష్, కేకే ఖదీర్, జమ్మలమడుగు, మైలవరం, పెద్దముడియం మండలాలకు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మాట తప్పిన జగన్ : భూపేశ్‌రెడ్డి

ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి స్టీల్‌ప్లాంట్ నిర్మిస్తానని మాట తప్పారని నిరుద్యోగులను మోసం చేశారని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి దేవగుడి భూపేశ్‌రెడ్డి విమర్శించారు. శనివారం కడప ఉక్కు మా హక్కు పాదయాత్రలో జమ్మలమడుగు నారాపురం వెంకటేశ్వరస్వామి వద్ద నుంచి ప్రారంభించిన పాదయాత్ర కన్నెలూరు శివాలయం వద్దకు చేరింది. అక్కడ ఆయన విలేకరులతో మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం కోసం లేనిపోని హామీలిచ్చినట్లు తెలిపారు. జగన్‌మోహన్ రెడ్డి అధికారం కోసం పాదయాత్రలో నిరుద్యోగులకు స్టీల్‌ప్లాంట్ నిర్మించి ఉద్యోగాలు కల్పిస్తానని హామీ ఇచ్చి ప్రజలు, నిరుద్యోగులు ఓట్లు వేస్తే ఫ్యాక్టరీ నిర్మాణాన్ని నిర్మించాలనే ఆలోచన లేదన్నారు. అయితే అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో 2019లో జమ్మలమడుగు మండలం సున్నపురాళ్లపల్లె, కన్నెతీర్థం గ్రామాల మధ్య స్టీల్‌ప్లాంట్ నిర్మాణానికి ఒక శిలాఫలకం వేసి టెంకాయ కొట్టి అదే రోజు స్టీల్‌ప్లాంట్ మూడు సంవత్సరాల్లో నిర్మించి ఉద్యోగాలు ఇప్పిస్తానని జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారన్నారు. ఆయన ఇచ్చిన గడువు దాటిపోయి రెండోసారి అదే ప్రాంతంలో దాని పక్కనే మరోశిలాఫలకం, భూమిపూజలు చేశారన్నారు. ఇంతవరకు అధికారంలో ఉన్నప్పుడు ఆయన రెండు టెంకాయలు కొట్టి రెండు శిలాఫలకాలు సమాధుల్లా పెట్టి ఫ్యాక్టరీ నిర్మించాలని ఒక్క రోజు కూడా ఆయన ఆలోచనలో లేదన్నారు. ఎంపీ అవినాష్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని స్టీల్‌ప్లాంట్ విషయంపై అడిగిన పాపాన పోలేదన్నారు. జమ్మలమడుగు నియోజకవర్గం అభివృద్ధిలో శూన్యమని ఆయన విమర్శించారు.

వైసీపీ పాలనలో రాష్ట్రం అప్పుల పాలు





ప్రొద్దుటూరులో ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సతీమణి మౌనికారెడ్డి తదితరులు

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 10 : వైసీపీ పాలనలో 8 లక్షల కోట్ల అప్పులు చేసి రాష్ట్రాన్ని దివాలా తీయించారని మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ఆరోపించారు. శనివారం కొత్తపల్లె పంచాయతీలోని లక్ష్మీనగర్, ఆటోనగర్‌లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ ముందస్తు మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నంద్యాల కొండారెడ్డి, నాగమునిరెడ్డి, ఘంటశాల వెంకటేశ్వర్లు, ఇస్మాయిల్, పేట రమణ, ఖదీర్, సహదేవుడు, పుల్లయ్య, సుబ్రహ్మణ్యం, కులాయప్ప, సుబ్బారెడ్డి, పట్నం పవన్‌కుమార్, చంద్రశేఖర్, బద్వేల్ ఎల్లారెడ్డి, ఆరవేటి రాజ,అన్నారం దస్తగిరి,నాగేష్, బచ్చల ప్రతాప్ పాల్గొన్నారు.

బద్వేలు రూరల్..: చంద్రబాబును తిరిగి సీఎంను చేస్తేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షురాలు మాచుపల్లె లక్ష్మీదేవి, పోరుమామిళ్ల మాజీ సర్పంచ్ హబీబున్నీసా పేర్కొన్నారు. శనివారం మున్సిపల్ పరిధిలోని 25వ వార్డులో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ నిర్వహించారు. కార్యక్రమంలో 25వ వార్డు కౌన్సిలర్ నాగిరెడ్డి శివమ్మ, 20వ వార్డు కౌన్సిలర్ గాజులపల్లె ధనలక్ష్మి, 33 వార్డు కౌన్సిలరు మిత్తికాయల సునీతయాదవ్, కేవీ సుబ్బారెడ్డి, కాల్వపల్లె వీరారెడ్డి, బిజివేముల వెంకటసుబ్బారెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డి,తోమల సంజీవ్, సుబ్బారెడ్డి, చిట్టెం శంకర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు..: టీడీపీ ప్రభుత్వం వస్తేనే సాధ్యమౌతుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రవీణ్‌రెడ్డి సతీమణి మౌనికారెడ్డి పేర్కొన్నారు. శనివారం 3 వవార్డు శాస్త్రీనగర్ ఏరియాలో మౌనికారెడ్డి ఆధ్వర్యంలో బాబూ ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రవీణ్ సోదరి హరితారెడ్డి, 3 వార్డు ఇన్‌చార్జ్ సుబ్రహ్మణ్యం, రాజా హోటల్ మధు, పొట్టిపాటి గంగాధర్, సుబ్బు, మాజీ కౌన్సిలర్లు తాటి శ్రీను, నల్లబల్ల భాగ్యమ్మ, కడప పార్లమెంటు అధికారప్రతినిధి ఆవుల దస్తగిరి, తదితరులు పాల్గొన్నారు.



బద్వేలులో ప్రచారం చేస్తున్న బొజ్జ అరుణ

నేడు వాసవీమాత
ఆత్మార్పణ దినోత్సవం

మైదుకూరు, ఫిబ్రవరి 10 :వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక అమ్మవారు శాలలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు హోమాలు నిర్వహించనున్నారు. ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు సూరిశెట్టి ప్రసాద్ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులచే బోవెలకుంట్ల సత్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకాలు చేపట్టి చండీహోమాలు నిర్వహించనున్నారు. అలాగే కన్యకలచే అమ్మవారి రూపం ధరించి అగ్నిగుండ ప్రవేశ కార్యక్రమం నిర్వహించనున్నారు.

టింబర్‌డిపోలో చోరీ

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 10 :మండలంలోని రంగసముద్రం పంచాయతీ పరిధిలోని ఓ టింబరు డిపోలో గుర్తు తెలియని వ్యక్తులు దూరి క్యాష్ కౌంటరులో ఉన్న రూ.30వేలు నగదు అపహరించారని సంఘటన పై కేసు నమోదు చేశామని ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. శుక్రవారం రాత్రి మైదుకూరు రోడ్డులో ఉన్న టింబరు డిపోలో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి క్యాష్ కౌంటరులో ఉన్న నగదును దొంగలించారని శనివారం ఉదయం షాపు తెరవగా చోరీ జరిగిందని గుర్తించి డిపో యజమాని పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అలాగే పోరుమామిళ్ల ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఓ అంగడిలో కూడా చోరీకి పాల్పడినట్లు సమాచారం.

బాబు జగ్జీవన్‌రామ్‌కు భారతరత్న పురస్కారం ఇవ్వాలి

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 10 : బాబు జగ్జీవన్‌రామ్‌కు భారతరత్న పురస్కారం ఇవ్వాలని ఏపీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ డిమాండ్ చేశారు. శనివారం ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ మూడు దశాబ్దాల రాజకీయ జీవితంలో బాబుజగ్జీవన్‌రామ్ నలుగురు ప్రధానమంత్రుల మంత్రివర్గంలో పనిచేశారని తెలిపారు. ఆయన చేపట్టిన శాఖల్లో అనేక సంస్కరణలను అమలు చేసి ప్రజల మన్ననలు పొందారన్నారు. బాబుజగ్జీవన్ రామ్‌కు భారత రత్న ఇచ్చే వరకు రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్‌ల వద్ద నిరసనలను తెలుపుతామన్నారు. ఏపీఎమ్మార్పీఎస్ నాయకులు బాలలక్షుమయ్య మాదిగ, నాగభూషణం మాదిగ, మనోహర్, బాలయ్య, రామాజి, బాలనరసింహులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 10 : సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చల్లా రాజగోపాల్ యాదవ్ పేదలకు అన్నదానం చేశారు. శనివారం అన్వర్ హాల్ వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమినికి ముఖ్య అతిథిగా హాజరైన వెటర్నరీ డాక్టర్ భాస్కర్ మాట్లాడుతూ చల్లా రాజగోపాల్ యాదవ్ చేపట్టిన సామాజిక సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. ప్రతి శనివారం పాతబస్టాండ్, అన్వర్ హాల్, పౌర్ణమి రోజున పెద్దమ్మ గుడి వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో చల్లా మధు, శ్రీనివాసులు, జయచంద్ర, రమణ, మధు, రవి పాల్గొన్నారు.

16న దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 10 : కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 16న నిర్వహించే దేశ వ్యాప్త కార్మిక, కర్షక మైత్రి సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు పేర్కొన్నారు. శనివారం ఎన్జీఓ హోంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, జిల్లా మాజీ నాయకుడు రామయ్య, సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ 13 జాతీయ కార్మిక సంఘాలు, 540 రైతు సంఘాల ఆధ్వర్యంలో సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. సమ్మెలో భాగంగా 14న పట్టణంలో నిర్వహించే బైక్ ర్యాలీని, 16న మున్సిపల్ ఆఫీసు నుంచి గాంధీరోడ్డు, టీబీ రోడ్డు, రాజీవ్ సర్కిల్ మీదుగా శివాలయం సర్కిల్ వరకు చేపట్టే ర్యాలీలో రైతులు, కార్మిక సంఘాలనాయకులు, కార్మికులు, అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు హరి, విజయకుమార్, ఏసోబ్, ఈడెం లక్ష్మీనారాయణ, సాల్మన్, రాఘవ, గుర్రమ్మ, సుబ్బలక్ష్మి, గీత, మద్దిలేటి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బద్వేలు..: ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ కార్మికులు, కర్షకుల హక్కులను కాలరాస్తున్న బీజేపీ విధానాలను వ్యతిరేకిస్తూ ఈ నెల 16న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్వేష్, ఏటీయూసీ జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్ పేర్కొన్నారు. శనివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు పరచకుండా కార్మిక రైతాంగ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ ఈ నెల 16 న జరిగే దేశవ్యాప్త పారిశ్రామిక సమ్మె గ్రామీణ ప్రాంత బంద్ జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటరమణ, డీవైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి నాగార్జున, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి నాగేష్, డీహెచ్‌పీఎస్ నాయకులు పెంచలయ్య పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..:మోదీ విధానాలు దేశ ప్రజలకు పెనుముప్పు అని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పిడుగు మస్తాన్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు భైరవ ప్రసాద్ అన్నారు. శనివారం పోరుమామిళ్ల ఆర్టీసీ బస్టాండులోని ఓ హోటల్‌లో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింద. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 16న జరిగే గ్రామీణ బంద్ పారిశ్రామిక సమ్మె జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల అధ్యక్ష కార్యదర్శులు పీరయ్య నాయకులు పాల్గొన్నారు.

సైకో ప్రభుత్వాన్ని సాగనంపండి

సైకిలుకు పట్టం కట్టండి : మాజీ ఎమ్మెల్యే విజయమ్మ



పోరుమామిళ్ల జయహో బీసీ కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విజయమ్మ

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 10 : రాబోవు ఎన్నికల్లో సైకో పార్టీ అయిన వైసీపీని సాగనంపాలని బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, యువనేత రితీష్‌కుమార్‌రెడ్డి, బద్వేలు టీడీపీ ఇన్‌చార్జ్ బొజ్జ రోశన్న అన్నారు. శనివారం కమ్మవారిపల్లె సమీపంలోఉన్న సీసీఆర్ కాంప్లెక్స్‌లో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు భైరవ ప్రసాద్ అధ్యక్షతన జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూవైసీపీ అధికారంలోకి వచ్చాక బీసీ నాయకులపై దాడులు, హత్యలు ఎక్కువయ్యాయన్నారు. ప్రశ్నిస్తే జైలుకు పంపడం, ప్రాణాలు తీయడం, భూములు కబ్జా చేయడం వైసీపీకి పరిపాటైందన్నారు.ఈ వైసీపీ ప్రభుత్వానికి కాలం చెల్లిందని, ఈ ఎన్నికల్లో ఈ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ అధ్యక్షుడు మేకల బాబుయాదవ్, స్టేట్ జంగం సాధికారత కన్వీనరు ఉమాకాంత్, బీసీ ఫెడరేషన్ కన్వీనరు నర్సింహులు, జిల్లా జనరల్ సెక్రటరీ మురళీకృష్ణయాదవ్, బెస్త సాధికార రాష్ట్ర కన్వీనరు రాంప్రసాద్, తొగట క్షత్రియ రాష్ట్ర కన్వీనరు మడక చక్రధర్, బీసీ జిల్లా కన్వీనరు సుబ్బరాయుడు, మార్కెట్ యార్డుఛైర్మన్ చెరుకూరి చెన్నరాయుడు, పోరుమామిళ్ల సర్పంచ్ యనమల సుధాకర్, సాదనకారి రంతు, ఇమాంహుసేన్,బాలాజీ, మల్లిఖార్జునరెడ్డి, మార్కెట్ యార్డుమాజీ వైస్ ఛైర్మన్ ఎస్ఎంబాషా, చంద్రయ్య, మురళి, ఎంపీటీసీ సెట్టెం ప్రతాప్, సిద్దవరం మాజీ సర్పంచ్ సునీల్, షరీఫ్, అన్వర్, బీసీ నాయకులు పాల్గొన్నారు.

బీసీలకు అండగా నిలిచిన ఏకైక పార్టీ టీడీపీ

బద్వేలు టౌన్, ఫిబ్రవరి 10 : టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు బీసీలకు అన్ని విధాల పెద్ద పీట వేసి రాజకీయ ప్రాధాన్యతనిచ్చి అండగా నిలిచిన ఏకైక పార్టీ టీడీపీ అని బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, టీడీపీ నియోజకవర్గ సమన్వయ కర్త రితీష్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీలను నమ్మించి మోసం చేసిన జగన్ వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వారికి రక్షణ కరువైందన్నారు. బీసీలకు రక్షణ కల్పించే దిశగా భరోసా కల్పించేందుకు టీడీపీ జయహో బీసీ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. రాష్ట్రంలో బీసీ ప్రజా ప్రతినిధులకు కనీస గౌరవం లేకుండాపోయిందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో బీసీలంతా ఏకతాటిపై వచ్చి టీడీపీని గెలిపించాలన్నారు.

ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జ రోశన్న, టీడీపీ బీసీ జిల్లా అధ్యక్షుడు మేకల బాబు, జోన్ కో-ఆర్డినేటరు నరసింహులు, బీసీ నాయకులు గోపిదేశి కొండయ్య, సింగరయ్య, రమణయ్య, జహంగీర్‌బాషా, మిత్తికాయలరమణ, కొలవలి వేణుగోపాల్, రంగయ్య, బయన్న, ఉప్పుటూరు రమణ, గుర్రి రాజా, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.